www.flashindianews.com

# ఫ్లాష్ ఇండియా

తెలుగు దినపత్రిక

FLASH INDIA TELUGU DAILY

RNI NO.APTEL/2010/33229

సంపుటి : 17 | సంచిక : 137 | గురువారం 02.07.2026 | ఎడిటర్ : కొమరాజు శ్రీనివాసులు | పేజీలు : 08 | వెల రూ : 2/-

**విలేకరులు కావలెను**

18 సం॥ లుగా వెలువడుతున్న "ఫ్లాష్ ఇండియా" తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు తెలంగాణ రాష్ట్రంలోని జిల్లాలు, నియోజకవర్గాల, మరియు మండలాల వారీగా విలేకరులు కావలెను..

సెల్ నెంబర్: 9951494039

## రూ.10 పరేషాన్..

- కనుమరుగవుతున్న రూ.10 నోటు
- చిల్లర కోసం వ్యాపారుల తంటాలు
- డిజిటల్ చెల్లింపులతో తగ్గిన నగదు వినియోగం
- యూపీఐ దెబ్బకు చిన్న నోట్ల చలామణి తగ్గుదల
- రూ.10 నోట్ల కొరతతో చిన్న లావాదేవీల్లో ఇబ్బందులు
- చిరు వ్యాపారులపై పెరుగుతున్న చిల్లర భారం

02



## సనాతనం అంటే అధికారం.. డబ్బేనా?

- సనాతనం అంటే అధికారం.. డబ్బేనా?
- అయోధ్య స్కామ్‌లో బీజేపీపై కేజ్రీవాల్ విమర్శలు
- జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితులు
- దేశవ్యాప్తంగా దుమారం రేపిన రామాలయ విరాళాల వివాదం
- రూ.200 కోట్ల స్కామ్ ఆరోపణలు.. రాజకీయ రగడ
- సనాతనుల మనోభావాలు దెబ్బతిన్నాయి

03



## నేడు, రేపు రిజిస్ట్రేషన్లు బంద్

- ఆస్తి కొనుగోలుదారులకు బ్యాడ్ న్యూస్
- రెండు రోజుల పాటు రిజిస్ట్రేషన్లకు బ్రేక్
- సర్వర్లు డౌన్.. రిజిస్ట్రేషన్ సేవలు స్తంభించాయి
- సాంకేతిక అప్‌గ్రేడ్‌తో తాత్కాలిక అంతరాయం
- సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద పెరిగిన నిరీక్షణ

05




# ముగిసిన కేంద్ర కేబినెట్ భేటీ..

## రూ.14,115 కోట్లతో భారీ రోడ్డు ప్రాజెక్టులకు ఆమోదం

- మోదీ అధ్యక్షతన కేంద్ర కేబినెట్ కీలక నిర్ణయాలు
- ఢిల్లీ ట్రాఫిక్‌కు చెక్.. ద్వారకా టన్నెల్‌కు గ్రీన్ సిగ్నల్
- ఆరు లేన్ల అండర్‌గ్రౌండ్ టన్నెల్ నిర్మాణం
- ద్వారకా-డీఎన్‌డీ మధ్య ప్రయాణానికి భారీ ఊరట
- సదరన్ రిడ్జ్ అడవులకు నష్టం లేకుండా టన్నెల్ నిర్మాణం
- హైబ్రిడ్ యాన్యుటీ మోడల్‌లో ఐదేళ్లలో పూర్తి లక్ష్యం
- ఓడరేవుల ఆధునీకరణకు భారీ పెట్టుబడులు
- 5 కొత్త విమానాశ్రయాలు.. విస్తరించనున్న ఉడాన్ పథకం

02

### ఆరు లేన్లతో ద్వారకా టన్నెల్ ప్రాజెక్టు..
### రిడ్జ్ అడవులకు లేదు.. ఢోకా

ఢిల్లీకి ఊపిరితిత్తులు లాంటి సదరన్ రిడ్జ్ అడవులకు ఎటువంటి నష్టం వాటిల్లకూడదని ప్రధాని మోదీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అందుకే ఈ టన్నెల్‌ను అడవికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పూర్తిగా భూగర్భంగుండా నిర్మిస్తామని మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులో దాదాపు 3.14 కిలో మీటర్ల మేర ట్విన్-ట్యూబ్ అండర్‌గ్రౌండ్ టన్నెల్ ఉండనుంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రాబోయే ఐదేళ్లలో ఇది పూర్తి కానుంది.





# ఆదాయ పెంపుపై ఫోకస్..

## ఊహాజనిత బడ్జెట్ వద్దు.. వాస్తవికంగానే వెళ్దాం

### లీకేజీలకు చెక్.. 'చేజింగ్ సెల్'కు గ్రీన్ సిగ్నల్

### నిధుల సమీకరణలో రాజీ లేదు.. సీఎం స్పష్టమైన ఆదేశాలు

## ఏఐతో సంక్షేమ పథకాల అమలుకు సిద్ధం

- రాష్ట్ర ఆదాయంపై సీఎం రేవంత్ ఫుల్ ఫోకస్
- బడ్జెట్ టార్గెట్లపై అధికారులకు సీఎం వార్నింగ్
- లీకేజీలకు చెక్.. 'చేజింగ్ సెల్'కు గ్రీన్ సిగ్నల్
- ఆదాయ సమీకరణలో వేగం పెంచాలని ఆదేశం
- ఏఐతో సంక్షేమ పథకాల అమలుకు సిద్ధం
- భూసేకరణ వేగవంతం.. అభివృద్ధి పనులకు ప్రాధాన్యం
- వాస్తవ అంచనాలతోనే బడ్జెట్ రూపకల్పన
- శాఖల పనితీరుపై సీఎం కీలక సూచనలు
- ప్రభుత్వ ఆదాయం పెంపే లక్ష్యం
- నిధుల సమీకరణలో రాజీ లేదు.. సీఎం స్పష్టమైన ఆదేశాలు
- ఆదాయ వనరుల పెంపుపై సీఎం రేవంత్ సమీక్ష
- బడ్జెట్ లక్ష్యాల సాధనకు శాఖలకు కీలక ఆదేశాలు
- ఆదాయ లీకేజీలపై కఠిన చర్యలకు సీఎం ఆదేశం

03

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

రాష్ట్ర ప్రభుత్వ ఆదాయ వనరుల పెంపు, బడ్జెట్ లక్ష్యాల సాధనపై సీఎం రేవంత్ రెడ్డి నేడు ఉన్నతాధికారులతో కీలక సమీక్ష సమావేశం నిర్వహించారు. హైదరాబాద్‌లోని MCRHRDలో జరిగిన ఈ సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారులు రామకృష్ణారావు మరికొందరు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర బడ్జెట్‌కు అనుగుణంగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలంటే ఆదాయ సమీకరణపై అన్ని శాఖలు మరింత సీరియస్‌గా దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. ముఖ్యంగా HMDA, TGIIC, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్ శాఖలతో పాటు ఆదాయ వనరులకు సంబంధించిన అన్ని విభాగాల్లో ఎలాంటి లీకేజీలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆదాయ వసూళ్లను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా "చేజింగ్ సెల్" ఏర్పాటు చేసి.. పెండింగ్ అంశాలపై నిరంతరం ఫాలోఅప్ చేయాలని అధికారులకు సూచించారు. శాఖల వారీగా సామర్థ్యాన్ని పెంచుకోవడం ద్వారా మాత్రమే...

# సీఎంకు సవాల్.!

## ఏ అంశంపైనైనా చర్చకు సిద్ధం


### ప్రజల సమస్యల కంటే రాజకీయాలకే ప్రాధాన్యం

### 'నీ తప్పులు నిరూపించకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా'..

- సీఎంకు బహిరంగ సవాల్ విసిరిన కేటీఆర్
- 'టాపిక్ మీది... వేదిక మీది... చర్చకు నేను సిద్ధం'
- తెలంగాణ అప్పులపై మాటల యుద్ధం
- రైతు బంధు బకాయిలపై బీఆర్ఎస్ ప్రశ్నల వర్షం
- 'పనిచేయని వారే ఎక్కువ మాట్లాడుతారు'
- ప్రభుత్వ వైఫల్యాలపై కేటీఆర్ ఎదురుదాడి
- రాజకీయాల నుంచి తప్పుకుంటానంటూ కేటీఆర్ ఛాలెంజ్
- ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని సీఎంకు సూచన
- బీఆర్ఎస్-కాంగ్రెస్ మధ్య మాటల పోరు మరింత ముదిరింది

02





## బాధితురాలికి హైకోర్టు నోటీసులు

- బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ
- బాధితురాలికి నోటీసులు జారీ చేసిన న్యాయస్థానం
- బెయిల్ పిటిషన్‌పై విచారణ ఎల్లుండికి వాయిదా
- 'కేసు రాజకీయ ప్రేరేపితమే'.. భగీరథ్ వాదన
- పోలీసుల విచారణకు సహకరిస్తున్నానన్న నిందితుడు
- పోక్సో కేసులో రెగ్యులర్ బెయిల్ కోరిన భగీరథ్

02

# కేసులకు భయపడేది లేదు

- కాళేశ్వరం, మేడిగడ్డ అంశాలపై ప్రభుత్వాన్ని నిలదీత
- రైతుల నీటి సమస్యలకు సమాధానం చెప్పాలన్న డిమాండ్
- కేసీఆర్‌పై విమర్శలు మానుకోవాలన్న హరీశ్‌రావు
- కేసులకు భయపడేది లేదన్న గంగుల కమలాకర్
- ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలని సూచన
- ఓట్లు గల్లంతు కాకుండా బీఎల్ఏలకు దిశానిర్దేశం
- రాబోయే ఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్
- పార్టీ శ్రేణులకు హరీశ్‌రావు కీలక సూచనలు

03



# బాబ్లీ గేట్లు..రీ ఓపెన్



- బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లు ఎత్తివేత
- సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు చర్యలు
- సీడబ్ల్యూసీ పర్యవేక్షణలో గేట్ల నిర్వహణ
- బాసర వైపు గోదావరి జలాల విడుదల
- మహారాష్ట్రలో వర్షాభావం.. వెలవెలబోతున్న గోదావరి
- వరద ప్రవాహం లేక రైతుల్లో ఆందోళన
- గోదావరిలో కేవలం 0.2 టీఎంసీల ప్రవాహం
- అక్టోబర్ 28 వరకు తెరిచే ఉండనున్న గేట్లు

02

# తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టొద్దు..

## ఎంత రెచ్చగొట్టినా ఎలాంటి ఢోకా లేదు

### నితిన్ నబీన్ టూర్ అట్టర్ ఫ్లాప్



- పెండింగ్ ప్రాజెక్టులపై ఎందుకు మాట్లాడ లేదని ప్రశ్న
- సోనియా గాంధీ వల్లే తెలంగాణ ఆవిర్భావమన్న కాంగ్రెస్
- రైతు భరోసాతో ప్రజల్లో కాంగ్రెస్‌కు బలం కేంద్ర ప్రభుత్వంపై వరుస విమర్శలు
- కాళేశ్వరం, అయోధ్య అంశాలపై బీజేపీని నిలదీత
- మత రాజకీయాలకు తెలంగాణలో తావులేదన్న టీపీసీసీ చీఫ్
- ఈడీ, సీబీఐ దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు
- మత రాజకీయాలకు తెలంగాణలో తావులేదన్న టీపీసీసీ చీఫ్

03

### ఈడీ, సీబీఐ దుర్వినియోగం చేస్తున్నారు

# వైద్యుల సేవలు అమూల్యం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. తమ నైపుణ్యం ద్వారా ప్రతి రోజూ వేల ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, తగిన మానవ వనరులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లతో పాటు ఇతర పోస్టులను కూడా పెద్ద సంఖ్యలో భర్తీ చేశామని చెప్పారు. సుమారు 15 వేల పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేర్చుతూ 48 డెంటల్ సర్జన్ పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. డాక్టర్ల దశాబ్దకాల ఆకాంక్ష అయిన ఉస్మానియా నయా హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించామని, అలాగే గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో నూతన హాస్టళ్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని మంత్రి తెలిపారు. వైద్యులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందికి మెరుగైన వర్క్ ఎన్విరాన్‌మెంట్ కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని మంత్రి గుర్తు చేశారు. అద్దె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ వైద్యుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా వైద్యులు తమ సేవలను కొనసాగించాలని కోరుతూ, డాక్టర్స్ డే సందర్భంగా మరోసారి రాష్ట్రంలోని వైద్యులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.



# చరిత్ర పుటల్లోకి ఉపాధి హామీ పథకం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారత దేశ గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో పెను సంచలనం సృష్టించిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కాలగర్భంలో కలిసిపోయింది. నరేగా స్థానంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన 'వికసిత్ భారత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్, అజీవికా మిషన్-గ్రామీణ్' చట్టం ఇవాల్టి నుంచి దేశవ్యాప్తంగా అమల్లోకి వచ్చింది. ఇప్పటి వరకు ఉన్న ఉపాధి హామీలో ప్రతి కూలీకి 100 రోజుల పని దినాలు ఉండగా, కొత్తగా వచ్చిన చట్టం ప్రకారం ఇకపై గ్రామీణ కుటుంబాలకు 125 రోజుల ఉపాధి హామీతో పాటు రోజూ వారీ కనీస వేతనం రూ.300 గా ఖరారు చేశారు. గతంలో 263 రకాల పనులకు మాత్రమే అనుమతి ఉండగా ఈ నూతన పథకంలో ఆ సంఖ్యను 318కి పెంచారు. అలాగే గతంలో నరేగా కోసం కేంద్రం 100 శాతం నిధులు కేటాయిస్తుంటే ప్రస్తుత మార్పుల వల్ల కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం నిధులను భరించాల్సి ఉంటుంది. దీనివల్ల రాష్ట్రంపై అదనపు భారం పడుతుందని పలు రాష్ట్రాలు ఈ కొత్త చట్టంపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నాయి.

**పలు రాష్ట్రాలు అభ్యంతరం:**

కేంద్రం తీసుకువచ్చిన ఈ'వికసిత్ భారత్-గ్యారెంటీ ఫర్ రోజ్‌గార్ అండ్ ఆజీవిక మిషన్ గ్రామీణ్' పథకంపై తెలంగాణతో పాటు మరికొన్ని రాష్ట్రాలు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. ఈ పథకాన్ని వ్యతిరేకిస్తూ తెలంగాణ ప్రభుత్వం శాసనసభలో తీర్మానం సైతం చేసింది. ఈ పథకంలో చేరాలా వద్దా అనే దానిపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసిన ప్రభుత్వం రేపు (జులై 2)న జరగబోయే రాష్ట్ర కేబినెట్ లో సమగ్రంచా చర్చించి తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం తెలిపింది.

# బాధితురాలికి హైకోర్టు నోటీసులు



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** పోక్సో కేసులో రిమాండ్ ఖైదీగా ఉన్న బండి భగీరథ్ బెయిల్ పిటిషన్‌పై ఇవాళ తెలంగాణ హైకోర్టులో విచారణ జరిగింది. తనపై నమోదైన కేసు తప్పుడుదని, ఇదంతా పూర్తిగా రాజకీయ ప్రేరేపితంగా జరిగిన వ్యవహారమని భగీరథ్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు. తాను ఎలాంటి తప్పు చేయలేదని పోలీసుల విచారణకు సహకరిస్తున్నానని పేర్కొంటూ తనకు బెయిల్ మంజూరు చేయాలని న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. అయితే నిందితుడి బెయిల్ అభ్యర్థనపై బాధితురాలి వాదన కూడా వినాల్సి ఉన్నందున, ఈ విషయమై కౌంటర్ దాఖలు చేయాలంటూ బాధితురాలికి న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణ ఎల్లుండికి వాయిదా వేసింది.

**బెయిల్ ముగియడంతో ఇటీవల మళ్లీ జైలుకు:**

కాగా ఓ మైనర్ బాలికను లైంగికంగా వేధించిన వ్యవహారంలో బండి బగీరథ్‌పై పేట్‌బషీరాబాద్ పోలీసుస్టేషన్‌లో మే 8న పోక్సో కేసు నమోదైంది. అనంతరం పరారైన భగీరథ్‌ను మే 16న పోలీసులు అరెస్టు చేసి, చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ క్రమంలో తన ఇంజినీరింగ్ పరీక్షలు రాసేందుకు వీలుగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు భగీరథ్‌కు మధ్యంతర బెయిలు మంజూరు చేసింది. గత ఈ నెల 20 నుంచి 24వ తేదీ వరకు మధ్యంతర బెయిలు లభించింది. అయితే బెయిల్ గడువు ముగియడంతో గత గురువారం తిరిగి అతడిని చర్లపల్లి జైలుకు అధికారులు తరలించారు. ఈ క్రమంలో రెగ్యులర్ బెయిల్ పిటిషన్ విచారణకు రావడంతో ఎల్లుండి హైకోర్టు ఎలాంటి నిర్ణయం తీసుకోనుంది అనేది ఉత్కంఠగా మారింది.

# ముగిసిన కేంద్ర కేబినెట్ భేటీ..

**న్యూ ఢిల్లీ :** ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన ఇవాళ జరిగిన కేంద్ర కేబినెట్ భేటీ కాసేపటి క్రితం ముగిసింది. ఈ మేరకు మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాలను కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భేటీలో రూ.14,115 కోట్ల విలువైన భారీ రోడ్డు, మౌలిక వసతుల ప్రాజెక్టులకు ఆమోద ముద్ర వేశామని అన్నారు. ముఖ్యంగా రాజధాని ఢిల్లీ ప్రాంతంలో ట్రాఫిక్ కష్టాలకు శాశ్వత విముక్తి కల్పించడంతో పాటు పొరుగు రాష్ట్రమైన ఉత్తరప్రదేశ్‌లో కనెక్టివిటీని పెంచేందుకు కేబినెట్ కీలక నిర్ణయం తీసుకుందని తెలిపారు.

**ఆరు లేన్లతో ద్వారకా టన్నెల్ ప్రాజెక్టు..**

కేబినెట్ నిర్ణయాల్లో భాగంగా అత్యంత కీలకమైనది ఢిల్లీలోని ద్వారకా టన్నెల్ ప్రాజెక్టు. దాదాపు రూ.6,970 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ ఆరు లేన్ల అండర్‌గ్రౌండ్ టన్నెల్ రాజధానిలో ట్రాఫిక్ రద్దీని భారీగా తగ్గించనుంది. ఈ ప్రాజెక్టు కింద మొత్తం 8.1 కిలో మీటర్ల మేర కొత్త కారిడార్‌ను అభివృద్ధి చేయనున్నారు. ఇక ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఉన్న శివమూర్తి ఇంటర్‌ఛేంజ్ నుంచి ప్రారంభం కానుంది. అది అక్కడ నుంచి వసంత కుంజ్, నెల్సన్ మండేలా మార్గ్ మీదుగా సాగుతుంది. చివరిగా బారాపుల్లా డ్రైన్ సమీపంలోని ఎలివేటెడ్ కారిడార్ గుండా ప్రయాణించి DND ఫ్లైవేకి లింక్ చేయనున్నారు. దీంతో వెస్ట్ ఢిల్లీ, గురుగ్రామ్ నుంచి సౌత్, ఈస్ట్ ఢిల్లీ వైపు వెళ్లే వారికి ప్రయాణ సమయం బాగా కలిసి రానుంది.

**రిడ్జ్ అడవులకు లేదు.. ఢోకా**

ఢిల్లీకి ఊపిరితిత్తులు లాంటి సదరన్ రిడ్జ్ అడవులకు ఎటువంటి నష్టం వాటిల్లకూడదని ప్రధాని మోదీ స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. అందుకే ఈ టన్నెల్‌ను అడవికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా పూర్తిగా భూగర్భం గుండా నిర్మిస్తామని మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టులో దాదాపు 3.14 కిలో మీటర్ల మేర ట్విన్-ట్యూబ్ అండర్‌గ్రౌండ్ టన్నెల్ ఉండనుంది. హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ కింద రాబోయే ఐదేళ్లలో ఇది పూర్తి కానుంది. అదేవిధంగా ఢిల్లీ ప్రాజెక్టుతో పాటు, ఉత్తరప్రదేశ్‌లోని బుందేల్‌ఖండ్ ప్రాంతంలో కనెక్టివిటీని పెంచేందుకు రూ.7,145 కోట్లతో కాన్పూర్ - కబ్రాయ్ హైవే ప్రాజెక్టుకు కూడా క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇవే కాకుండా దేశంలోని 57 కీలక రైల్వే ప్రాజెక్టులకు రూ.2.60 లక్షల కోట్లు, ప్రధాన నగరాల్లో 12 కొత్త మెట్రో ప్రాజెక్టులు రూ.1.50 లక్షల కోట్లు, ఓడరేవుల ఆధునీకరణ, షిప్ రిపేర్ సదుపాయాలు, నౌకాయాన సంస్కరణల కోసం సుమారు రూ.1.50 లక్షల కోట్లు, చివరగా 5 కొత్త ఎయిర్‌పోర్టుల నిర్మాణంతో పాటు రూ.37,000 కోట్లతో 'ఉడాన్' పథకాన్ని విస్తరించబోతున్నారు.

# సీఎంకు సవాల్.!

## 'నీ తప్పులు నిరూపించకపోతే రాజకీయాల నుంచి తప్పుకుంటా'..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. ముఖ్యమంత్రి ఇటీవల చేసిన వ్యాఖ్యలకు స్పందించాల్సిన అవసరం ఏర్పడిందని చెబుతూ కేటీఆర్ తనదైన శైలిలో ప్రతిస్పందించారు. సీఎం రేవంత్ వాడుతున్న భాష, చేస్తున్న వ్యాఖ్యలు ఒక బాధ్యతాయుత పదవిలో ఉన్న వ్యక్తికి తగిన విధంగా లేవని విమర్శించారు. పనిచేయని నాయకులే ఎక్కువగా మాట్లాడుతారని, ప్రజల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాల్సిన సమయంలో రాజకీయ విమర్శలకే పరిమితమవుతున్నారని ఆరోపించారు. తెలంగాణను తానే పాలిస్తున్న సీఎం రాష్ట్రాన్నే విమర్శించడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వంతో సంబంధాల అంశాన్ని ప్రస్తావిస్తూ.. ఢిల్లీలో తెలంగాణకు గౌరవం లేదని చెప్పే ముఖ్యమంత్రి అక్కడికి పదేపదే ఎందుకు వెళ్తున్నారని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేంద్రం నుంచి పెద్దగా సహకారం లేకపోయినా రాష్ట్ర అభివృద్ధి కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని, సాగు విస్తీర్ణాన్ని గణనీయంగా పెంచామని అన్నారు. రాష్ట్ర అప్పుల విషయంలో కూడా ముఖ్యమంత్రి తప్పుడు ప్రచారం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ అప్పులపై పార్లమెంట్‌లో అడిగిన ప్రశ్నకు కేంద్ర ప్రభుత్వమే సమాధానం ఇచ్చిందని, తమ ప్రభుత్వం చేసిన అప్పుల వివరాలు అధికారికంగా నమోదయ్యాయని తెలిపారు. ప్రస్తుతం ప్రభుత్వం పరిపాలనలో విఫలమవడం వల్లే గత ప్రభుత్వంపై నిరంతరం విమర్శలు చేస్తున్నారని అన్నారు. రైతు బంధు పథకంపై కూడా ముఖ్యమంత్రి అసత్యాలు మాట్లాడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. రైతులకు చెల్లించాల్సిన భారీ మొత్తాలు ఇంకా బకాయిగా ఉన్నాయని, వాటిని ఎప్పుడు చెల్లిస్తారో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి ఉందని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డికి కేటీఆర్ బహిరంగ సవాల్ విసిరారు. ఏ అంశంపైనైనా, ఎక్కడైనా చర్చకు తాను సిద్ధమని స్పష్టం చేశారు. టాపిక్, వేదిక ముఖ్యమంత్రి ఇష్టమని, తన ఆరోపణలను నిరూపించలేకపోతే తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటానని ప్రకటించారు. అదే విధంగా సవాల్ చేసిన వ్యక్తి దానికి కట్టుబడి ఉండే ధైర్యం కూడా చూపించాలని అన్నారు. చివరగా సీఎం రాజకీయ భవిష్యత్తుపై వ్యాఖ్యానిస్తూ.. ప్రజల సమస్యలను విస్మరించి రాజకీయ ఆరోపణలకే పరిమితమైతే తీవ్ర రాజకీయ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని కేటీఆర్ హెచ్చరించారు.

# రూ.10 పరేషాన్..

**జఫర్‌గడ్(వరంగల్),ఫ్లాష్ ఇండియా :** ఒకప్పుడు చేతిలో ముడుచుకుని ఉండే రూ.10 నోటు.. నెమ్మదిగా కనుమరుగవుతోంది. టీ కప్పు, బస్సు టికెట్, చిన్న చిన్న కొనుగోళ్లకు కీలకపాత్ర పోషించేంది. వీటి చలామణి తగ్గిపోవడంతో వినియోగదారులు, వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చిరు వ్యాపారుల వద్ద ఏదైనా వస్తువు కొనుగోలు చేసినపుడు రూ.100 నోటు ఇస్తే వ్యాపారులు తిరిగి ఇవ్వాల్సిన చిల్లరకు నానా తంటాలు పడుతున్నారు. గతంలో రూ.1, రూ.2 చెల్లింపులకు బదులు చాక్లెట్లు, బిస్కెట్లు, వక్కపొడి వంటివి ఇచ్చేవారు. కానీ రూ.10 ఏమి ఇవ్వాలని వ్యాపారులు ఆలోచనలో పడ్డారు.

**పెరిగిన ఆన్‌లైన్, డిజిటల్ చెల్లింపులు..**

కరోనా తర్వాత డిజిటల్, ఆన్‌లైన్ చెల్లింపులు పెరిగాయి. ప్రభుత్వాలు డిజిటల్ చెల్లింపులను ప్రోత్సహించడంతో అన్ని వర్గాల ప్రజలు ఆన్‌లైన్ చెల్లింపులకు అలవాటు పడిపోయారు. చిన్నపాటి చెల్లింపులకు ఫోన్‌పే, గూగుల్ పే వంటివి ప్రత్యేకంగా వ్యాలెట్ రూపంలో సులభతర చెల్లింపులు అనువ తిస్తున్నాయి. దీంతో దుకాణాలు, వీధి వ్యాపారులు, చిన్న దుకాణాల్లో సైతం డిజిటల్ చెల్లింపులు పెరిగిపోయాయి. దీంతో రూ.5, రూ.10 లావాదేవీలకు కూడా వినియోగదారులు నోట్లు ఇవ్వడం లేదు. క్రమంగా రూ.10 నోటు బదలాయింపు జరగకపోవడం వల్ల వ్యాపారులు, వినియోగదారుల వద్ద అందుబాటులో లేకుండా పోయింది.

**చిన్న మొత్తాల చెల్లింపులో సమస్య...**

రూ.10నోట్ల కొరత కారణంగా చిన్న మొత్తాల చెల్లింపుల విషయంలో చిల్లర సమస్య ఎక్కువగా కనిపిస్తోంది. దీంతో చాలా మంది నగదు బదులు డిజిటల్ చెల్లింపుల వైపు మొగ్గు చూపుతున్నారు. యూపీఐ, క్యూఆర్ కోడ్, మొబైల్ బ్యాంకింగ్ వంటి సేవల వినియోగం గత కొన్నేళ్లుగా గణనీయంగా పెరిగింది. ఒకపుడు పెద్ద మొత్తాల చెల్లింపులకు మాత్రమే ఉపయోగించిన యూపీఐ ఇపుడు చిన్న మొత్తాలకూ సహజంగా మారింది. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయడం, మొబైల్ ద్వారా చెల్లించడం.. ఇవి ఇపుడు అలవాటుగా మారిపోయాయి. ఈ నేపథ్యంలో నగదు - డిజిటల్ మధ్య సమతుల్యత అవసరం స్పష్టంగా కనిపిస్తోంది.

**చిన్న నోట్ల లభ్యత పెరిగితే..**

అయితే గ్రామీణ ప్రాంతాలు, చిన్న వ్యాపారులు, వృద్ధులు ఇంకా నగదుపైనే ఆధారపడుతున్నారు. వీరికి రూ.10నోట్ల కొరత ఒక చిన్న అసౌకర్యం మాత్రమే కాకుండా.. రోజువారీ కార్యకలాపాల్లో ఒక అడ్డంకిగా మారుతోంది. అవసరమైన మేరకు చిన్న నోట్లను బ్యాంకులు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరతున్నారు. డిజిటల్ చెల్లింపులు వేగవంతంగా, సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ.. నగదు చలామణికి కూడా సమాన ప్రాధాన్యం ఉంది.

# బాబ్లీ గేట్లు..రీ ఓపెన్


**ఉమ్మడి ఆదిలాబాద్,ఫ్లాష్ ఇండియా :** నిర్మల్ జిల్లా బాసర సరిహద్దు ఎగువ ప్రాంతంలో మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టు 14 గేట్లను బుధవారం ఎత్తివేశారు. మహారాష్ట్రలోని ధర్మాబాద్ తాలూకా పరిధిలో గోదావరిపై నిర్మించిన వివాదాస్పద బాబ్లీ ప్రాజెక్టుతో తెలంగాణ, ఆంధ్ర కు నీటి కొరత ఏర్పడిందని ఇక్కడి ప్రభుత్వాలు కేంద్రం దృష్టికి తీసుకెళ్లాయి. ఈ వివాదం సుప్రీంకోర్టుకు వెళ్లడంతో కేంద్ర జల వనరుల సంఘం, తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు, మహారాష్ట్ర ప్రభుత్వం సమక్షంలో కఠినమైన నిబంధనలు అమల్లోకి వచ్చాయి. సుప్రీంకోర్టు. మార్గదర్శకాల ప్రకారం సి డబ్ల్యు సి పర్యవేక్షణలో జూలై 1 నుండి అక్టోబర్ 28 వరకు (వర్షాకాలం) బాబ్లీ ప్రాజెక్టు పూర్తి గేట్లను ఎత్తివేసేలా నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా ప్రతి సంవత్సరం మార్చి 1వ తేదీన ఈ ప్రాజెక్టు ద్వారా ధర్మాబాద్ తాలూకా పరిధిలో దిగువ ప్రాంతానికి 0.6 టీఎంసీలు అన్నిటిని మాత్రమే విడుదల చేయాల్సి ఉంటుంది. గోదావరి జలాల వినియోగంలో రాష్ట్రాల మధ్య వివాదానికి తావు లేకుండా 2013 నుండి జలాల వినియోగం, నీటి పంపిణీ కొనసాగుతోంది.

**మహారాష్ట్రలో తీవ్ర వర్షా భావం.. గోదావరి వెలవెల..!**

తెలంగాణలో గత వారం రోజులు నుండి అడపాదడప్ప కురుస్తున్న సాధారణ వర్షాలకు గోదావరిలో ఇప్పుడిప్పుడే నీటిమట్టం పెరుగుతోంది. అయితే మహారాష్ట్ర నాసిక్ లో జన్మించిన గోదావరికి ఈ వానాకాలం తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎడారిని తలపిస్తోంది. వరద ప్రవాహం లేక ధర్మాబాద్ ప్రాంత సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎలినెనో ప్రభావం గా 75% జూన్ నెలలో వర్షపాతం లోటు ఉంది. బుధవారం సి డబ్ల్యు సి పర్యవేక్ష ణలో సుప్రీం ఆదేశాల మేరకు 14 గేట్లు ఎత్తివేయగా, 0.2 టీఎంసీ ల వరద ప్రవాహం మాత్రమే దిగువ బాసర వైపు విడుదలైంది. ఈరోజు నుండి అక్టోబర్ 28 వరకు నాలుగు నెలల పాటు బాబ్లీ గేట్లు తెరిచే ఉంచుతారు. ఈ నీటి వినియోగంలో ఆంధ్రప్రదేశ్ కు 0.6 టీఎంసీల గోదావరి నీరు పంపిణీ చేయాల్సి ఉంటుంది. గేట్ల ఎత్తివేత కార్యక్రమంలో సి డబ్ల్యుసి ఇఇ చరణ్, జేఈలు ప్రణీత్, శ్యాం ప్రకాష్, మహారాష్ట్రకు చెందిన నాందేడ్ ఇరిగేషన్ సి ఆర్ బన్సోద్, ఇరిగేషన్ అధికారి పోట్టార్, ఎస్సారెస్పీ ఎస్సీ కొత్త రవి, ఇరిగేషన్ ఇంజనీర్లు, ఎన్ శ్యాం కుమార్, ఎస్. విన్యాస్ రెడ్డి పాల్గొన్నారు.

**గోదావరి బేసిన్ నిరాశాజనకం..!**

జూన్ మాసంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు గోదావరి నది ప్రవాహం పై ఆందోళన కల్గిగిస్తోంది. ఎలినెనో ప్రభావంగా శ్రీరామ్



సాగర్ ప్రాజెక్టులోకి నిన్నటి వరకు ఒక టీఎంసీ మాత్రమే వరద నీరు వచ్చి చేరింది. శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు ద్వారా 9 లక్షల ఎకరాల ఆయకట్టు సాగు కావలసి ఉంది. ఇక నిజాంసాగర్ ప్రాజెక్టులోకి ఈసారి ఒక చుక్క నీరు కూడా రాలేదు. గోదావరి బేసిన్ లోని కడెం, ఎల్లంపల్లి, బెడ్ మానేరు ప్రాజెక్టుల్లోను వర్షాభావం కారణంగా డెడ్ స్టోరేజ్ ఛాయలు వానాకాలం సాగు రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఇక శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు ఎస్కేప్ గేట్ల ద్వారా నిజామాబాద్, అదిలా బాద్, నిర్మల్ జిల్లాలకు మిషన్ భగీరథ కింద ఎస్సారెస్పీ నుండి 231 క్యూసెక్కుల నీటిని పంపిణీ చేయాల్సి ఉంటుంది

# మూడెకరాల రైతులకు శుభవార్త..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్రవ్యాప్తంగా వానాకాలం సీజన్‌కు సంబంధించి 'రైతుభరోసా' పెట్టుబడి సాయం నిధుల పంపిణీ ప్రక్రియ రెండోరోజూ విజయవంతంగా కొనసాగుతోంది. ప్రభుత్వ ప్రణాళికల ప్రకారం అర్హులైన రైతుల బ్యాంక్ ఖాతాల్లోకి డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ పద్ధతిలో నేరుగా నగదు జమ అవుతోంది. నిధుల పంపిణీలో భాగంగా ఇవాళ మూడెకరాల వరకు భూమి ఉన్న రైతులందరికీ పెట్టుబడి సాయాన్ని ప్రభుత్వం విడుదల చేసింది. రెండో రోజు లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తే.. తెలంగాణలో మొత్తం 10.68 లక్షల మంది రైతుల ఖాతాల్లోకి రూ.1,590.02 కోట్ల నిధులు బదిలీ కానున్నాయి.

**ఇప్పటి వరకు రూ.4,072 కోట్లు జమ..**

కాగా, వానాకాలం సీజన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ప్రభుత్వం మొత్తం 54.96 లక్షల మంది రైతుల ఖాతాలకు గాను రికార్డు స్థాయిలో రూ.4,072.04 కోట్ల నిధులను సక్సెస్‌ఫుల్‌గా బదిలీ చేసింది. అయితే, ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అవుతుండటంతో రైతన్నలు ఉత్సాహంగా సాగు పనుల్లో నిమగ్నమయ్యారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా
మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి
7730032999
flashindiadaily@gmail.com

# తెలంగాణ ప్రజలను రెచ్చగొట్టొద్దు..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ తెలంగాణ పర్యటన అట్టర్ ఫ్లాప్ అయిందని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ అన్నారు. బీజేపీకి తెలంగాణలో అవకాశం లేదని ఆ పార్టీ అవసరం ఇక్కడ లేదన్నారు. మూడు రోజుల పర్యటనలో నితిన్ నబీన్ ఏం చేశారు? రాష్ట్రంలో ఉన్న పెండింగ్ ప్రాజెక్టుల గురించి ఆయన ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. ఇవాళ మీడియాతో మాట్లాడిన మహేశ్ కుమార్ గౌడ్ తెలంగాణ పరిస్థితుల మీద, కుల సమీకరణలు, ఉద్యమం మీద ఆయనకు అవగాహన ఉందా? అని నిలదీశారు. బీజేపీ ముక్త్ భారత్ కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు.

**ఎంత రెచ్చగొట్టినా ఎలాంటి ఢోకా లేదు:**

సోనియా గాంధీ వల్లే తెలంగాణ సాకారం అయిందని వేల మంది ప్రాణ త్యాగం వల్ల రాష్ట్రం సాకారం అయిందని చెప్పారు. నిన్నే సీఎం రేవంత్ రైతు భరోసా విడుదల చేశారని తెలంగాణ ప్రజలా గుండెల్లో కాంగ్రెస్ పార్టీ

శాశ్వతంగా ఉండిపోతుందన్నారు. బీజేపీ చెబుతున్న వికసిత్ భారత్‌లో తెలంగాణ లేదా? రెండు కోట్ల ఉద్యోగాలు పేరిట మోసం చేయలేదా? అని నిలదీశారు. సంపన్న వర్గం కోసమే కేంద్రం పని చేస్తోందని అయోధ్య దోపిడి గురించి, కాళేశ్వరం స్కామ్ పై సీబీఐ దర్యాప్తు పై నబీన్ ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణలో మత వైషమ్యాలకు తావులేదని మత చిచ్చు పెట్టాలని ప్రయత్నిస్తే సాధ్యం కాదన్నారు. మత సామరస్యానికి ప్రతీక తెలంగాణ అన్నారు. బీహార్‌లో ఓటు దొంగిలిస్తే మీనాక్షి నటరాజన్ విషయంలో ఏకంగా సీటు చోరీ చేశారని మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. సర్ కార్యక్రమం ఓట్ల జత కోసం అయితే అది కాస్త ఇపుడు ఓట్ల తొలగింపు కార్యక్రమంలా మారిందన్నారు. సీబీఐ, ఈడీ, ఎలక్షన్ కమిషన్‌ను గుప్పిట్లో పెట్టుకొని బీజేపీ అనుబంధ సంస్థలా వాడుకుంటున్నారని ఎలక్షన్ కమిషన్ చేతిలోకి తీసుకోని రాజ్యాంగ విలువలను తుంగలో తొక్కుతున్నారని ఆరోపించారు. విభజన హామీలు నెరవేస్తారని, సందేశం ఇస్తారని ఆశిస్తే విష బీజం వేశారని బీజేపీ ముసుగులో ఇతర పార్టీలు రెచ్చగొట్టినా కాంగ్రెస్ పార్టీకి ఎలాంటి ఢోకా లేదన్నారు.

**టెంపరరీ గోల్స్ మాత్రమే రీచ్:**

కేసీఆర్‌కు ప్రతిపక్ష హోదా ఇస్తే ఫామ్ హౌస్‌కు పరిమితం అయ్యారని బావ, బామ్మర్దులు మాపై విష ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. కానీ తెలంగాణ రాష్ట్ర ప్రజలు మా పార్టీ వైపు ఉన్నారని, మా ప్రభుత్వం వచ్చాక 70 వేల ఉద్యోగాలు ఇచ్చామని చెప్పారు. జాతీయ అధ్యక్షుడు వస్తె పట్టుమని 2 వేల మందిని కూడా పోగు చేసుకోలేని పార్టీ బీజేపీ అన్నారు. పేద ప్రజలకు మోడీ ప్రభుత్వం ఇచ్చింది ఏమి లేదు 90 శాతం ప్రతిపక్ష నాయకుల మీద ఈడీ, దాడులు చేయించారు. సీబీఐ, ఈడీలను అడ్డుపెట్టుకుని కక్ష సాధింపు చర్యలు చేస్తున్నారు. తెలంగాణలో బీజేపీ నాయకులు టెంపరరీ గోల్స్ మాత్రమే రీచ్ అవుతారని బీజేపీతో పాటు ఎన్ని పార్టీలు కలసి పోటీ చేసిన కాంగ్రెస్‌ను ఢీ కొట్టలేరని ధీమా వ్యక్తం చేశారు.

# కేసులకు భయపడేది లేదు

**కొత్తపల్లి,ఫ్లాష్ ఇండియా :** కరీంనగర్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశంలో పార్టీ నేతలు రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై విమర్శలు గుప్పించారు. జిల్లా కేంద్రంలోని కొండా సత్యలక్ష్మి వేదికలో జరిగిన ఈ సమావేశానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు ముఖ్య అతిథిగా హాజరుకాగా, మాజీ మంత్రి గంగుల కమలాకర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా పార్టీ క్షేత్రస్థాయి నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

**ప్రభుత్వ వైఫల్యాలపై హరీశ్‌రావు విమర్శలు..**

హరీశ్‌రావు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కరీంనగర్ కీలక పాత్ర పోషించిందని గుర్తు చేశారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ రెండుసార్లు ఎంపీగా గెలిచిన గడ్డ కరీంనగర్ అని పేర్కొన్నారు. అలాంటి ప్రాంతంలో కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధిలో విఫలమైందని ఆరోపించారు. మేడిగడ్డ నుంచి నీటిని తరలించే అవకాశం ఉన్నప్పటికీ, ప్రభుత్వం రాజకీయ కారణాలతో నీటిని వినియోగించకుండా నిలిపివేసిందని విమర్శించారు. కేసీఆర్ దూరదృష్టితో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా రైతులకు నీరు అందించారని, ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న నీటి ఇబ్బందులకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు మేలు చేయకుండా కేసీఆర్‌పై విమర్శలు చేయడం తగదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అన్నారు.

**కేసులకు భయపడేది లేదు: గంగుల కమలాకర్..**

మాజీ మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ తనను నాలుగుసార్లు గెలిపించిన కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో నియోజకవర్గ అభివృద్ధి కుంటుపడిందని ఆరోపించారు. తన క్యాంపు కార్యాలయంపై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోలేదని, అయితే ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన చేసిన తమపై క్రిమినల్ కేసులు నమోదు చేశారని విమర్శించారు. ప్రభుత్వం ఎన్ని కేసులు పెట్టినా భయపడబోమని స్పష్టం చేశారు. పార్టీ కార్యకర్తలు కూడా ఎలాంటి కేసులకు భయపడవద్దని, తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అక్రమ కేసులను రద్దు చేస్తామని పేర్కొన్నారు.

**ఎస్ఐఆర్ ప్రక్రియపై అప్రమత్తంగా ఉండాలి..**

రాబోయే ఎన్నికల నేపథ్యంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై హరీశ్‌రావు పార్టీ నాయకులకు కీలక సూచనలు చేశారు. ప్రతి 20 ఏళ్లకు ఒకసారి జరిగే ఈ ప్రక్రియలో బీఎల్ఏలు (బూత్ లెవల్ ఏజెంట్లు) అత్యంత అప్రమత్తంగా ఉండాలని, ఓట్లు గల్లంతు కాకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే ఓటు హక్కు కోల్పోయే పరిస్థితులు తలెత్తే అవకాశం ఉందని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, మాజీ ఎమ్మెల్యేలు సుంకే రవిశంకర్, రసమయి బాలకిషన్, మాజీ టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు, ఎర్రోళ్ల శ్రీనివాస్, తుల ఉమ, పార్టీ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణారావు, పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, సర్దార్ రవీందర్ సింగ్, చల్ల హరిశంకర్, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ పై ఎన్నో అనుమానాలున్నాయి

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో ఎస్ఐఆర్ ప్రక్రియపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ హైదరాబాద్‌లో ఆయన జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. ఎస్ఐఆర్‌పై ప్రజల్లో, రాజకీయ వర్గాల్లో అనేక అనుమానాలు, ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయని, వీటన్నింటికీ ఈసీ తుది వివరణ ఇవ్వాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున చర్చ కూడా జరిగిందని కేటీఆర్ అన్నారు. ఎస్ఐఆర్ విషయంలో సాక్షాత్తూ దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా జోక్యం చేసుకుందని కేటీఆర్ గుర్తు చేశారు. కాబట్టి, కేంద్ర ఎన్నికల సంఘం ఎస్ఐఆర్‌పై పూర్తి పారదర్శకంగా, నిష్పక్షపాతంగా వ్యవహరించాల్సి ఉంటుందని అన్నారు. తెలంగాణలో ఎన్నికల సంస్కరణలు, నియోజకవర్గాల ప్రక్రియకు సంబంధించి భవిష్యత్తులో ఏం జరిగినా.. అది అత్యంత పారదర్శకంగా, సరైన పద్ధతిలో జరుగుతుందని తాను ఆశిస్తున్నానని, ప్రజాస్వామ్య పద్ధతులకు లోబడే రాష్ట్రంలో ఎస్ఐఆర్ ప్రక్రియ ముగియాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# ఆదాయ పెంపుపై ఫోకస్..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర బడ్జెట్ లక్ష్యాలను విజయవంతంగా సాధించాలంటే ఆదాయ సమీకరణపై అధికారులు సీరియస్‌గా దృష్టి సారించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదాయం పెంపుదల, నిధుల సమీకరణ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు. ఇవాళ ఆయన క్యాంపు ఆఫీసులో ఉన్నతాధికారులతో సీఎం సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ.. ఆదాయ లీకేజీలను అరికట్టడానికి HMDA, TGIIC, కమర్షియల్ ట్యాక్సెస్, ఎక్సైజ్ వంటి కీలక శాఖలపై ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. ఆదాయ పెంపు ప్రక్రియను రోజువారీగా పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా ఒక 'చేజింగ్ సెల్‌ను ఏర్పాటు చేసి, నిరంతరం ఫాలోఅప్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాల పారదర్శకత కోసం సరికొత్త సాంకేతికతను వాడాలని సీఎం రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ని ఉపయోగించుకుని లబ్ధిదారుల జాబితాను ఖరారు చేయాలని, దానిని డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్ కి అనుసంధానం చేయాలని అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేశారు. ఇకపై కేవలం అంకెలకే పరిమితమయ్యే ఊహాజనిత బడ్జెట్ కాకుండా, క్షేత్రస్థాయి వాస్తవికత ఆధారంగానే కొత్త బడ్జెట్‌ను రూపొందించుకోవాలని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను, ఇతర పనులను పూర్తి చేసేందుకు అనుగుణంగా నిధుల కేటాయింపులు ఉండాలని, అందుకోసం భూసేకరణకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. ప్రభుత్వం అనుకున్న స్థాయిలో ఫలితాలు సాధించాలంటే శాఖల వారీగా అధికారులు తమ సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుచుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి హెచ్చరించారు.

# అనలాగ్, మెగా సంస్థలతో సర్కార్ బిగ్ డీల్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ మహానగరంలో రవాణా, మౌలిక వసతుల రంగాన్ని సరికొత్త సాంకేతికతతో తీర్చిదిద్దేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక అడుగు వేసింది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ అనలాగ్ , మౌలిక వసతుల దిగ్గజం మెగా ఇంజనీరింగ్ సంయుక్త భాగస్వామ్యంతో రాష్ట్రంలో అత్యాధునిక ప్రాజెక్టులను చేపట్టేందుకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీలో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పలువురు మంత్రుల సమక్షంలో అనలాగ్ సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మెగా ఎండీ పి.కృష్ణారెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. అయితే, భవిష్యత్ తరాల అవసరాల కోసం 'నెక్స్ట్ జనరేషన్ ఇంటెలిజెంట్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్', రోబోటిక్స్, సెన్సార్ల ఆధారిత 'ఫిజికల్ ఇంటెలిజెన్స్' ప్లాట్‌ఫామ్స్ వినియోగాన్ని ప్రతినిధులు సీఎంకు వివరించారు. దీని ద్వారా హైదరాబాద్‌ను 'కాగ్నిటివ్ సిటీ'గా మార్చవచ్చుని.. రోడ్లపై అంబులెన్స్‌లకు ఆటోమేటిక్‌గా మార్గం సుగమం చేయడం, నీటి లీకేజీలను ముందే గుర్తించడం, స్మార్ట్ పవర్ మేనేజ్‌మెంట్ వంటి సేవలు సాధ్యమవుతాయని తెలిపారు. నగరంలో చేపట్టబోయే ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు వివరాలను కూడా ఈ సందర్భంగా సీఎంకు సమర్పించారు. ఈ ప్రెజెంటేషన్‌పై స్పందించిన సీఎం రేవంత్ రెడ్డి ఇరు సంస్థలకు పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ నగరంలోని అన్ని ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఒకే గొడుగు కిందికి తెస్తూ ఇంటిగ్రేట్ చేయాలని, రోడ్లపై ఉండే రద్దీకి అనుగుణంగానే సిగ్నల్స్ ఆటోమేటిక్‌గా పనిచేసేలా చూడాలన్నారు. ముఖ్యంగా వాతావరణ మార్పులు, భారీ వర్షాల వంటి అత్యవసర పరిస్థితుల్లో ట్రాఫిక్‌ను సమర్థవంతంగా క్రమబద్ధీకరించేందుకు ఈ వ్యవస్థను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌కి అనుసంధానించాలని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# సనాతనం అంటే అధికారం.. డబ్బేనా?

**న్యూ ఢిల్లీ :** దేశ వ్యాప్తంగా అయోధ్య రామాలయ విరాళాల వివాదం కుదిపేస్తోంది. కోట్లాది రూపాయల విరాళాలు దారి మళ్లడంతో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దాదాపు రూ.200 కోట్ల స్కామ్ జరిగినట్లుగా ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్షాలు.. కేంద్ర ప్రభుత్వంపై దుమ్మెత్తిపోస్తున్నాయి. ఈ సందర్భంగా ఆప్ అధినేత కేజ్రీవాల్... కేంద్రానికి, ఉత్తరప్రదేశ్ బీజేపీ ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. కుంభకోణంతో దేశంలోని ప్రతి సనాతని మనస్తాపానికి గురయ్యారని పేర్కొన్నారు. బుధవారం మీడియాతో మాట్లాడిన కేజ్రీవాల్.. "రామాలయ విరాళాల కుంభకోణం దేశంలోని ప్రతి సనాతని హృదయాన్ని బాధించింది. ఇప్పటివరకు బయటపడింది మంచుకొండలో చిన్న భాగం మాత్రమే. ఇంకా చాలా విషయాలు బయటకు రావాల్సి ఉంది. బీజేపీ సనాతనాన్ని కేవలం అధికారం, డబ్బు కోసం మాత్రమే ఉపయోగించుకుంది" అని ఆరోపించారు. దేశంలో సనాతన ధర్మంపై నిజమైన విశ్వాసం ఉన్న పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీ మాత్రమేనని కేజ్రీవాల్ పేర్కొన్నారు. ప్రజలకు ఉచిత తీర్థయాత్రలు నిర్వహించామని.. పంజాబ్‌లో కాళీమాత, లవకుశ్ ఆలయాల నిర్మాణానికి కృషి చేస్తున్నామని.. భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అవినీతి రహిత పాలన అందించడం ద్వారా ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటున్నామని అన్నారు.

**అమిత్ షాపై ప్రశ్నల వర్షం**

కేంద్ర హోంమంత్రి అమిత్ షాను లక్ష్యంగా చేసుకుని కేజ్రీవాల్ పలు ప్రశ్నలు సంధించారు. "శ్రీరామాలయం ప్రాణ ప్రతిష్ఠ జరిగి రెండున్నరేళ్లు.. అంటే 891 రోజులు పూర్తయ్యాయి. ఈ కాలంలో అమిత్ షా ఒక్కసారి కూడా రామాలయాన్ని సందర్శించలేదు. శ్రీరాముడి పేరును అత్యధికంగా రాజకీయాల్లో ఉపయోగించిన వ్యక్తి ఆలయానికి మాత్రం వెళ్లలేదు" అని వ్యాఖ్యానించారు. తాను ఇంటర్నెట్‌లో వెతికానని... పాత్రికేయులతో మాట్లాడానని.. అలాగే చాట్‌జీపీటీని కూడా అడిగానని కేజ్రీవాల్ తెలిపారు. "అమిత్ షా తన ప్రసంగాల్లో.. ఇంటర్వ్యూల్లో 42 కంటే ఎక్కువసార్లు రామాలయం పేరును ప్రస్తావించి ఓట్లు అడిగారు. కానీ ఆలయానికి వెళ్లేందుకు మాత్రం సమయం దొరకలేదు" అని విమర్శించారు. "మీరు ఇప్పటివరకు రామాలయాన్ని ఎందుకు సందర్శించలేదు?, మీకు రామాలయానికి వెళ్లాలనే కోరిక లేదా?, మీకు శ్రీరాముడి ఆశీస్సులు అవసరం లేదా?, మీరు శ్రీరాముడిని దేవుడిగా భావించరా?." అని ప్రశ్నలు సంధించారు. అంతేకాకుండా అమిత్ షా తప్పకుండా ఒకసారి రామాలయాన్ని సందర్శించాలని కేజ్రీవాల్ కోరారు.

**14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ**

ఇదిలా ఉండగా రామాలయ విరాళాల దుర్వినియోగం కేసులో అరెస్టయిన నిందితులందరినీ అయోధ్య స్థానిక కోర్టు 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. ఆలయ విరాళాలు, కానుకల దుర్వినియోగంపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో ఉత్తరప్రదేశ్ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఆర్థిక అవకతవకలు, నిధుల దుర్వినియోగానికి సంబంధించిన అంశాలను అధికారులు లోతుగా పరిశీలిస్తున్నారు.

# ఎప్పటికీ అదే ఉంటుంది



**ఆంధ్రప్రదేశ్ :** 'ఏ దేశమైతే ప్రకృతితో కలిసి ఎదుగుతుందో, ఆ దేశం ఎప్పటికీ నిలిచి ఉంటుంది. ప్రకృతితో పాటు సాధించే అభివృద్ధే శాశ్వతంగా ఉంటుంది' అని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. మన వారసత్వం అనేది కేవలం మనం నిర్మించిన కట్టడాలు కాకూడదని, మనం కాపాడిన ప్రకృతి అయి ఉండాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్రంలో కొత్తగా అభివృద్ధి చేసిన 18 నగర వనాలు, ఎకో పార్కులు, కమ్యూనిటీ బేస్డ్ ఎకో టూరిజం ప్రాజెక్టులను బుధవారం మంగళగిరి క్యాంపు కార్యాలయం నుంచి వర్చువల్‌గా ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు.

**గ్రీన్ లంగ్స్‌లా నగర వనాలు**

ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ "నగరాలు, పట్టణాలు శరవేగంగా విస్తరిస్తున్న తరుణంలో ఈ నగర వనాలు పట్టణాలకు గ్రీన్ లంగ్స్‌లాగా పని చేస్తూ పర్యావరణ సమతుల్యతను కాపాడతాయి. కేంద్ర ప్రభుత్వ 'నగర వన యోజన' నిధులతో పాటు స్థానిక నిధులను సమకూర్చుకుంటూ రూ. 36 కోట్ల భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టును సిద్ధం చేశాం. ఒక్కో నగర వనాన్ని సుమారు 50 హెక్టార్ల విస్తీర్ణంలో, రూ. 2 కోట్ల వ్యయంతో నిర్మించాం. కొడూరు, కైలాసగిరి, మదనపల్లెలలో ప్రత్యేకంగా ఎర్రచందనం పరిరక్షణ పార్కులను ఏర్పాటు చేశాం. మన ప్రాచీన సంస్కృతి, సంప్రదాయ జ్ఞానాన్ని చాటి చెప్పేలా, జీవవైవిధ్య పరిరక్షణే ధ్యేయంగా నక్షత్ర వనాలు, రాశి వనాలను అభివృద్ధి చేశాం. ఈ పార్కులు కేవలం పచ్చదనాన్ని ఇవ్వడమే కాకుండా, ప్రజల శారీరక, మానసిక ఉల్లాసానికి కేంద్రాలుగా నిలవనున్నాయి. ఇందులో పక్షుల ఆవాసాలు, బోటింగ్, కయాకింగ్, ట్రెకింగ్ పాయింట్లు, యోగా కేంద్రాలు, ఓపెన్ జిమ్‌లు వంటి ఎన్నో ప్రత్యేక ఆకర్షణలను అందుబాటులోకి తీసుకొచ్చాం." అని చెప్పారు.

**పచ్చదనాన్ని కాపాడుకుందాం**

"కాంక్రీట్ జంగిల్‌గా మారుతున్న ఆధునిక నగరాలలో, అలసిన మనుషులకు ఈ నగర వనాలు ప్రకృతిలోని ప్రశాంతతను పరిచయం చేస్తాయి. ఇవి కేవలం నేటి అవసరాల కోసమే కాదు, రాబోయే తరాల కోసం మనం అందిస్తున్న పచ్చని వారసత్వం. ప్రతి ఒక్కరూ వీటిని కాపాడుకుంటూ, మరింత పచ్చని, పరిశుభ్రమైన ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగస్వాములు కావాలి" అని పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు.

# పేదల కోసం భూ పోరాటాలను తీవ్రతరం చేస్తాం



**హనుమకొండ,ఫ్లాష్ ఇండియా :** పేదలకు ఇళ్ల స్థలాలు అందించే వరకు భూ పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు స్పష్టం చేశారు. సీపీఐ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ఎదుట సీపీఐ, సీపీఎం, ఎంసీపీఐ తదితర వామపక్ష పార్టీలు భారీ పికెటింగ్ నిర్వహించాయి. ఉదయం నుంచే కలెక్టరేట్ వద్దకు చేరుకున్న నాయకులు, కార్యకర్తలు అధికారుల రాకను అడ్డుకోవడంతో కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పికెటింగ్ కారణంగా ప్రధాన రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా తక్కళ్లపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ.. పేదలకు ఇళ్ల స్థలాల పట్టాలు అందే వరకు ఎన్ని ఇబ్బందులు ఎదురైనా వెనక్కి తగ్గబోమన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూములను రియల్ ఎస్టేట్ మాఫియా, భూకబ్జాదారుల నుంచి రక్షించి, వాటిని నిరుపేదలకు పంపిణీ చేయాలని కోరారు. ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం కాకుండా కాపాడేందుకు వామపక్షాలు భూ పోరాటాలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. పేదల సమస్యలు పరిష్కరించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపిస్తూ, నిరుపేదలపై జరుగుతున్న చర్యలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పికెటింగ్ కొనసాగుతుండగా సుబేదారి పోలీసులు జోక్యం చేసుకుని తక్కళ్లపల్లి శ్రీనివాసరావుతో పాటు వామపక్ష నాయకులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా నాయకుల అరెస్టును అడ్డుకునేందుకు కార్యకర్తలు ప్రయత్నించడంతో పోలీసులు, వామపక్ష కార్యకర్తల మధ్య తోపులాట చోటుచేసుకుని కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె బిక్షపతి, సీపీఎం జిల్లా కార్యదర్శి జి. ప్రభాకర్ రెడ్డి, ఎంసీపీఐ జిల్లా కార్యదర్శి ఎన్. హంసారెడ్డి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నేదునూరి జ్యోతి, రాష్ట్ర సమితి సభ్యులు ఆదరి శ్రీనివాస్, మంద సదాలక్ష్మి, జిల్లా సహాయ కార్యదర్శులు తోట బిక్షపతి, మద్దెల ఎల్లేష్, పలువురు వామపక్ష నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్య వైఖరి..

**షాద్‌నగర్,ఫ్లాష్ ఇండియా :** ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారుల నిర్లక్ష్య వైఖరి పై షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక నీటిపారుదల శాఖ కార్యాలయంలో ప్రజాసమస్యల పై అధికారులతో మాట్లాడేందుకు బుధవారం ఉదయం 11 గంటలకు మాజీ ఎమ్మెల్యే అక్కడికి వెళ్లారు. అయితే ఆయన వెళ్లిన సమయంలో కార్యాలయంలో ఉన్నతాధికారులతో పాటు సిబ్బంది కూడా లేకపోవడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. షాద్‌నగర్ నియోజకవర్గంలోని చెరువులు, కాలువలు, జలవనరుల ఆక్రమణల అంశం పై అధికారులతో చర్చించేందుకు వస్తే ఒక్క అధికారి కూడా అందుబాటులో లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. ఈ విషయమై సంబంధిత అధికారిని మాజీ ఎమ్మెల్యే ఫోన్‌లో సంప్రదించగా, ఆ అధికారి నిర్లక్ష్యంగా స్పందించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బక్కని నరసింహులు మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో సిబ్బంది సమయపాలన పాటించకపోతే ప్రజలకు సేవలు ఎలా అందుతాయని ప్రశ్నించారు. ప్రధాన అధికారులే సమయానికి కార్యాలయానికి రాకపోతే, కిందిస్థాయి సిబ్బంది పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. ప్రజలు తమసమస్యల పరిష్కారం కోసం కార్యాలయాలకు వస్తుంటే అధికారులు అందుబాటులో లేకపోవడం సరికాదని పేర్కొన్నారు. అధికారులు, సిబ్బంది సమయపాలన పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని బక్కని నరసింహులు డిమాండ్ చేశారు.

## సంపాదకీయం

# ఇక్కడ యుద్ధం అక్కడ అస్త్రం


తెలంగాణలో బెంగాల్ తరహా రాజకీయం చేస్తామంటున్నారు బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్. కానీ ఎమ్మెల్యే స్థాయి నుంచి నేరుగా పార్టీ జాతీయ అధ్యక్షుడి స్థాయికి వెళ్లిన నబీన్.. తెలంగాణలో పరిస్థితుల గురించి అవగాహనతోనే మాట్లాడుతున్నారా.. లేదా అనే చర్చ జరుగుతోంది. దేశంలో పన్నెండేళ్లుగా బీజేపీ అధికారంలో ఉంది. అలాగే మూడొంతుల రాష్ట్రాలు కాషాయ పార్టీ నీడలోనే ఉన్నాయి. కానీ తెలంగాణను మాత్రం బీజేపీ టచ్ చేయలేకపోతోంది. లోక్‌సభ ఎన్నికల్లో 8 ఎంపీల గెలుపు బలం అనుకుంటే.. అసెంబ్లీ ఎన్నికల్లో అదే సంఖ్యలో ఎమ్మెల్యేలు గెలవటాన్ని ఎలా తీసుకోవాలో మొదట బీజేపీ ఆలోచించుకోవాలి. బెంగాల్ గెలుపుతో బీజేపీలో జోష్ మిన్నంటుతోంది. అందుకే తెలంగాణకు వచ్చిన ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు.. ఇక్కడ కూడా బెంగాల్ తరహా రాజకీయం చేస్తామంటున్నారు. అసలు ఓ రాష్ట్రంలో పనిచేసిన వ్యూహం.. మరోచోట ఎలా పనిచేస్తుందనేది తేలాల్సిన విషయం. దేశవ్యాప్తంగా కాషాయ జెండా ఎగరాలనేది బీజేపీ లక్ష్యం. అందుకు అనుగుణంగానే ఒక రాష్ట్రం తర్వాత మరో రాష్ట్రంలో పాగా వేస్తూ వెళ్తోంది. చివరకు అత్యంత కఠినమైన లక్ష్యంగా భావించిన బెంగాల్లోనూ బీజేపీ అధికారంలోకి రాగలిగింది. దీంతో ఈ ఊపులోనే తెలంగాణలో కూడా అధికారం దక్కించుకోవాలని పిలుపునిచ్చిన.. కాషాయ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ అంతటితో ఆగలేదు. తెలంగాణలోనూ బెంగాల్ తరహా రాజకీయం చేస్తామని ప్రకటించారు. ఇక్కడ బెంగాల్, తెలంగాణ.. రెండు రాష్ట్రాలూ వేటికవే భిన్నం. ఎక్కడి రాజకీయ వ్యూహాలు అక్కడే పనిచేస్తాయి. అంతేకానీ బెంగాల్ తరహా రాజకీయం.. ఇక్కడెలా చేస్తారనేది నితిన్ నబీనే చెప్పాలి. పైగా బెంగాల్లో టీఎంసీ నుంచి ఓ నేతను తెచ్చుకుని.. రాజకీయం చేసి.. ఆ రాష్ట్రంలో అధికారంలోకి రాగలిగింది బీజేపీ. కానీ తెలంగాణలో కిషన్ రెడ్డి, బండి సంజయ్ లాంటి నేతలు పాతిక, ముప్పై ఏళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నారు. ఈ తరుణంలో బెంగాల్ తరహా రాజకీయం పేరుతో నితిన్ నబీన్.. పరోక్షంగా గతంలో మోడీ చేసిన వ్యాఖ్యల్ని గుర్తుకుతెస్తున్నారా అనే సందేహాలు వస్తున్నాయి. నితిన్ నబీన్ ఎమ్మెల్యే స్థాయి నుంచి నేరుగా బీజేపీ జాతీయ అధ్యక్ష పదవిలోకి వచ్చారు. ఆయనకు తెలంగాణలో రాజకీయ స్థితిగతులు, ఇక్కడి బీజేపీ పనితీరు గురించి అవగాహన ఉందా.. లేదా అనేది మరో చర్చ. తెలంగాణలో బీజేపీ ఎందుకు పుంజుకోవడం లేదో ఆలోచించకుండా.. ఇక్కడ బెంగాల్ తరహా రాజకీయం చేస్తామంటూ మాట్లాడటం ఏంటో ఆయనకే తెలియాలి. ఎవరేమనుకున్నా.. తెలంగాణలో బీజేపీ జాతీయ నేతల ఆకాంక్షలకు, రాష్ట్ర పార్టీ పనితీరుకు చాలా తేడా ఉంది. అసలు జాతీయ నేతలకు, రాష్ట్ర స్థాయి నేతలకు ఈ గ్యాప్ ఎందుకొచ్చిందో ముందు తెలుసుకోవాలి. ఆగ్యాప్‌ను వీలైనంత త్వరగా పూడ్చుకున్న తర్వాతే.. తెలంగాణలో ఏ తరహా రాజకీయం చేయాలో ఆలోచించుకోవచ్చు. అదీ కాకుండా ప్రతిసారీ ఓ రాష్ట్రంలో బీజేపీ గెలవగానే.. వెంటనే తెలంగాణ వచ్చే ఆ పార్టీ జాతీయ నేతలు.. ఆ రాష్ట్రం తరహాలో ఇక్కడ రాజకీయం చేస్తి.. గెలిచేస్తామనడం పరిపాటి అయిపోయింది. చివరకు తెలంగాణ ప్రజలు కూడ ఇది రెగ్యులర్ డైలాగే కదా అనుకోకముందే జాగ్రత్తపడాల్సిన బాధ్యత బీజేపీపై ఉంది. అసలు తెలంగాణలో తెలంగాణ తరహా రాజకీయం చేయాలే కానీ.. బెంగాల్ తరహా రాజకీయం ఎలా చేస్తారనే రాజకీయ సందేహాలూ వస్తున్నాయి. మొదట రాష్ట్రంలో బీజేపీ రాజకీయ వ్యూహంపైనే క్యాడర్లో చాలా అనుమానాలున్నాయనే సంగతి నితిన్ నబీన్ దాకా చేరిందా.. లేదా అనేది మరో ప్రశ్న. తెలంగాణలో ఒక్కో ఎన్నికల సమయంలో ఒక్కో రకంగా వ్యవహరిస్తున్న బీజేపీ.. చివరకు అనుకున్న ఫలితం సాధించలేక చతికిలపడుతోందనే వాదన లేకపోలేదు. పైకి అధికారమే లక్ష్యం అని చెబుతున్నా.. లోపాయికారీ రాజకీయం అలాగే జరుగుతుందా.. లేదా అనేది ఎప్పుడూ చర్చనీయాంశమే. ఇక్కడ తెలంగాణ ప్రజలేమనుకుంటున్నారనే సంగతి పక్కనపెడితే.. కనీసం క్యాడర్ అయినా అధికారమే లక్ష్యం అనే మాటను చిత్తశుద్ధిగా నమ్మితోందా అనే ప్రశ్నలు కూడా ఉన్నాయి. అంతెందుకు కొన్నాళ్ల క్రితం రాష్ట్ర పార్టీ ముఖ్యనేతలే హస్తిన వెళ్లి.. మన రాజకీయ వ్యూహమేంటని జాతీయ నేతల్ని అడిగి చీవాట్లు తిన్న విషయం ఇంకా అందరి స్మృతిపథంలో నుంచి చెరిగిపోలేదు. ఇంతటి అయోమయ స్థితిని క్లియర్ చేయకుండా.. అధికారం ఎలా వస్తుందో.. నితిన్ నబీనే చెప్పాలి. నిజానికి తెలంగాణలో బీజేపీ చెప్పే మాటలకూ, చేసే చేతలకూ పొంతన లేదనే విమర్శలు వచ్చేలాగే ఆ పార్టీ వ్యవహారం ఉంటోంది. చివరకు రాష్ట్ర పార్టీలో దశాబ్దాలుగా పనిచేస్తున్న నేతలు కూడా కన్ఫ్యూజ్ అయ్యేలా పార్టీ పనితీరు ఉంటోందనే అభిప్రాయాలున్నాయి. అధికారం కోసం మిగతా రాష్ట్రాల్లో బీజేపీ ఎంత కసిగా పనిచేస్తోందో.. తెలంగాణలో కూడా అదే కసితో పనిచేస్తోందా.. అంటే లేదనే చెప్పాలి. అదేమంటే దానికి సవాలక్ష కారణాలు అంతర్గతంగా చెబుతారు. మొదట ఈ దుస్థితి నుంచి పార్టీని బయటపడేయటం.. నితిన్ నబీన్ తక్షణ కర్తవ్యం కావాలి. తెలంగాణలో రాజకీయ స్థితిగతులు, ఇక్కడి జనం ఆకాంక్షల గురించి బీజేపీకి అవగాహన లేదనుకోవటానికి లేదు. ఆ పార్టీకి జరిగిన చరిత్ర మొత్తం తెలుసు. అయినా సరే చేసిన పనులు చెప్పుకోలేక.. ఏం చేస్తామో క్లారిటీ ఇవ్వలేక.. ఎన్నికల్లో బొక్కబోర్లా పడుతోంది. కొన్నిసార్లు బీజేపీ గెలుపే లక్ష్యంగా చాలా క్రియాశీలకంగా దూసుకెళ్లి.. మళ్లీ ఆఖరి మెట్టుపై సడెన్‌గా స్లో చేయడం కూడా ఎన్నో అనుమానాలకు తావిచ్చిన మాట వాస్తవం. ఇప్పటికైనా నితిన్ నబీన్ బెంగాల్ తరహా రాజకీయం అనే ప్రకటనలు కాకుండా.. వాస్తవంగా పార్టీ స్థితిగతులు బేరీజు వేసి.. అందుకు తగ్గట్టుగా కార్యాచరణ తీసుకోవడం కీలకం. అప్పుడే తెలంగాణలో బీజేపీ పుంజుకునే అవకాశం ఉంటుంది. ఇప్పుడు బెంగాల్ గెలుపు ఉత్సాహంతో ఉన్నారు కాబట్టి.. తెలంగాణలోనూ బెంగాల్ తరహా రాజకీయం అంటే.. తాత్కాలికంగా బాగుంటుంది. కానీ కొన్నాళ్లు పోయాక.. అసలు ఇక్కడ బెంగాల్ తరహా రాజకీయం ఎలా చేస్తారని.. మళ్లీ బీజేపీ కార్యకర్తలకే అనుమానాలు వస్తే.. అది వారి తప్పు కాదు. ఏతావాతా రాష్ట్ర పార్టీ నేతలకు, శ్రేణులకు స్పష్టమైన దిశానిర్దేశం చేసి.. గెలుపు తప్ప మరే వ్యూహం పార్టీకి లేదనే క్లారిటీ ఇవ్వడం అత్యవసరం. అలా కొన్నాళ్ల పాటు రాజకీయ వ్యూహాన్ని స్థిరంగా కొనసాగిస్తేనే.. తెలంగాణలో బీజేపీ గెలుపు గురించి ఆలోచించగలదనడంలో సందేహం లేదు.




# సంక్షేమం ఆర్థిక భారం కాదు
# అభివృద్ధికి బాట!

ప్రభుత్వరంగ సంస్థల గురించి ఒక అపోహ దశాబ్దాలుగా ప్రచారంలో ఉంది. ప్రభుత్వాలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తే ఆ సంస్థలు దివాళా తీస్తాయని, ప్రజలకు రాయితీలు ఇస్తే ఆర్థిక క్రమశిక్షణ దెబ్బతింటుందని, అవి ఎప్పటికీ లాభాల్లోకి రావని కొందరు నమ్మించారు. తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్‌ఆర్టీసీ) సాధించిన చారిత్రాత్మక విజయం ఈ అపోహలన్నింటినీ ఒక్కసారిగా చెదరగొట్టింది. దాదాపు పదేళ్ల పాటు నష్టాలతో పోరాడిన టీజీఎస్‌ఆర్టీసీ, 2025--26 ఆర్థిక సంవత్సరంలో రూ. 1,059 కోట్లకు పైగా మిగులు నమోదు చేయడం కేవలం ఒక ఆర్థిక గణాంకం కాదు. ఇది తెలంగాణ ప్రభుత్వ పాలనాతత్వానికి, దూరదృష్టికి, ప్రజా సంక్షేమాన్ని అభివృద్ధితో ముడిపెట్టిన ఆలోచనకు దక్కిన ఘన విజయం. దీనిని అర్థం చేసుకోవాలంటే ఒక ప్రశ్నకు సమాధానం చెప్పాలి. ఒకప్పుడు నష్టాల ఊబిలో కూరుకుపోయిన సంస్థ, రెండేళ్ల వ్యవధిలోనే వరుసగా మిగులు ఎలా సాధించింది? ప్రభుత్వం టీజీఎస్ ఆర్టీసీని కేవలం ఒక వ్యాపార సంస్థగా చూడలేదు. ప్రజల జీవితాలను ముందుకు నడిపే సామాజిక బాధ్యత కలిగిన ప్రజాసేవా సంస్థగా చూసింది. అదే ఆలోచన ఈ మార్పునకు పునాది అయింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పుడు విమర్శలు వెల్లువెత్తాయి. 'ఆర్టీసీ పూర్తిగా కుప్పకూలుతుంది', 'ఉచిత పథకాలతో సంస్థ దివాళా తీస్తుంది', 'ప్రభుత్వం ప్రజాదరణ కోసం ఆర్థిక వ్యవస్థను పణంగా పెడుతోంది' అంటూ అనేక విమర్శలు వచ్చాయి. మహాలక్ష్మి పథకం వల్ల లక్షలాది మహిళలు మరింత ఎక్కువగా బస్సులను వినియోగించడం ప్రారంభించారు. గ్రామీణ మహిళలు, విద్యార్థినులు, చిన్న వ్యాపారులు, ఉద్యోగినులు, స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రతిరోజూ ధైర్యంగా ప్రయాణిస్తున్నారు. పెరిగిన ప్రయాణికుల సంఖ్య బస్సుల ఆక్యుపెన్సీని సుమారు 67శాతం నుంచి 98శాతానికి తీసుకెళ్లింది. ఒకప్పుడు ఖాళీగా తిరిగిన అనేక సర్వీసులు నేడు పూర్తిస్థాయిలో నడుస్తున్నాయి. అంటే ప్రభుత్వం ప్రజల కోసం ఖర్చు చేసిన ప్రతి రూపాయి తిరిగి ఆర్థిక కార్యకలాపాలను పెంచింది. ఇది సంక్షేమం కాదు అని ఎవరైనా చెప్పగలరా? ఇది ఖర్చు కాదు... పెట్టుబడి. మహాలక్ష్మి పథకానికి ప్రభుత్వం ఆర్టీసీకి సకాలంలో రీయింబర్స్‌మెంట్ అందించింది. ఈ నిర్ణయం వల్ల సంస్థలో నగదు ప్రవాహం మెరుగుపడింది. ఒకవైపు మహిళలకు ఉచిత ప్రయాణం, మరోవైపు సంస్థకు ఆర్థిక భద్రత. ఇదే తెలంగాణ మోడల్ ప్రత్యేకత. దేశంలో అనేక రాష్ట్రాల్లో సంక్షేమం, ఆర్థిక క్రమశిక్షణ మధ్య సంఘర్షణ కనిపిస్తుంటే, తెలంగాణ మాత్రం రెండింటినీ సమన్వయం చేసి చూపించింది. ఈ విజయాన్ని కేవలం మహాలక్ష్మి పథకానికే పరిమితం చేయడం సరైంది కాదు. టీజీఎస్‌ఆర్టీసీలో ఒకేసారి అనేక సంస్కరణలు అమలయ్యాయి. వ్యయ నియంత్రణ, డిజిటల్ టికెటింగ్ విస్తరణ, అద్దె బస్సుల సమర్థ వినియోగం, మార్గాల శాస్త్రీయ పునర్వ్యవస్థీకరణ, టోల్, సేఫ్టీ సెస్ రౌండ్- ఆఫ్ వంటి ఆదాయ వనరుల పెంపు, ఇంధన వినియోగంలో క్రమశిక్షణ, ప్రతి డిపోలో పనితీరు సమీక్ష-- ఇవి అన్నీ కలిసి సంస్థను ఆర్థికంగా బలోపేతం చేశాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో సంస్కరణలు అంటే ఉద్యోగులను తగ్గించడం కాదని, నిర్వహణను మెరుగుపరచడమే నిజమైన సంస్కరణ అని తెలంగాణ నిరూపించింది. ఏ ప్రభుత్వ విధానం అయినా దాన్ని విజయవంతం చేసేది ఉద్యోగులే. క్లిష్టపరిస్థితుల్లోనూ సంస్థను నిలబెట్టిన డ్రైవర్లు, కండక్టర్లు, మెకానిక్‌లు, సూపర్‌వైజర్లు, అధికారులు, కార్మిక సంఘాలు ఈ విజయానికి అసలైన భాగస్వాములు. ప్రజలకు చిరునవ్వుతో సేవలందించిన వారి కృషి లేకపోతే ఈ ఫలితం సాధ్యమయ్యేది కాదు. వారి శ్రమకు తెలంగాణ ప్రభుత్వం ఎల్లప్పుడూ గౌరవం ఇస్తుంది. ఒక సంస్థకు ప్రభుత్వం మూలధనం ఇవ్వగలదు. కానీ ప్రజల విశ్వాసాన్ని కొనివ్వలేదు. టీజీఎస్‌ఆర్టీసీపై తెలంగాణ ప్రజలు చూపించిన నమ్మకం ఈ విజయానికి మరొక కారణం. ప్రైవేట్ వాహనాల కంటే ప్రజా రవాణాను ఎంచుకోవడం ద్వారా ప్రజలు పర్యావరణ పరిరక్షణకు, ఇంధన పొదుపునకు, రోడ్డు భద్రతకు కూడా తోడ్పడ్డారు. ముఖ్యమంత్రి అనుముల రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయం ఒకే లక్ష్యంతో సాగుతోంది. అది ప్రజల జీవితాలను మెరుగుపరచడం. విద్య, వైద్యం, మహిళా సాధికారత, రైతు సంక్షేమం, ఉపాధి, మౌలిక సదుపాయాలు... ఇలా ప్రతి రంగంలో అభివృద్ధి, సంక్షేమం రెండింటినీ సమన్వయం చేస్తూ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. టీజీఎస్‌ఆర్టీసీ విజయం కూడా అదే దృక్పథానికి ప్రతిబింబం. ఈ విజయం అంతిమ గమ్యం కాదు. ఎలక్ట్రిక్ బస్సుల విస్తరణ, గ్రీన్ మొబిలిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫ్లీట్ మేనేజ్‌మెంట్, ఆధునిక బస్ స్టేషన్లు, మహిళల భద్రత, డిజిటల్ సేవలు, ఉద్యోగుల సంక్షేమం-- ఇవన్నీ రాబోయే సంవత్సరాల్లో టీజీఎస్‌ఆర్టీసీ అభివృద్ధి ప్రాధాన్యతలు. దేశానికి ఆదర్శంగా నిలిచే ప్రజా రవాణా వ్యవస్థను నిర్మించాలనే సంకల్పంతో తెలంగాణ ప్రభుత్వం ముందుకు సాగుతోంది. ఒకప్పుడు నష్టాల వార్తలతో నిలిచిన టీజీఎస్‌ఆర్టీసీ, నేడు విజయగాథగా మారింది. సంక్షేమం సక్రమమైన ఆర్థిక నిర్వహణతో కలిస్తే ప్రభుత్వరంగ సంస్థలు బలహీనపడవు... మరింత బలపడతాయి. ప్రజల విశ్వాసం, ఉద్యోగుల అంకితభావం, ప్రభుత్వ దూరదృష్టి ఒకే దిశగా సాగితే అసాధ్యం అనుకున్న లక్ష్యాలూ సుసాధ్యం అవుతాయి. టీజీఎస్‌ఆర్టీసీ చరిత్రలో నమోదైన ఈ మిగులు కేవలం ఆర్థిక లాభం కాదు. ఇది తెలంగాణ అభివృద్ధి తత్వానికి, సమర్థ పాలనకు, ప్రజలతో కలిసి నడిచే ప్రభుత్వానికి చిరస్థాయి గుర్తింపు.

# రెవెన్యూ కలెక్షన్.. కరప్షన్‌పై కన్ను!




రాష్ట్రవ్యాప్తంగా సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో కొనసాగుతోన్నఅవినీతిపై ప్రభుత్వం సీరియస్‌గా ఉన్నట్టు తెలిసింది. ఫిర్యాదులు వచ్చిన ఆఫీసుల్లో సోదాలు చేయడం, సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు సమాచారం. దీనితో నిఘా వర్గాలు సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో జరుగుతోన్న కార్యకలాపాలపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టినట్టు తెలుస్తున్నది. అలాగే శాఖలో అవినీతి తిమింగళాల జాబితాను తయారు చేసి, ఏసీబీకి అందించే పనిలో ఉన్నట్టు సమాచారం. ఈ మధ్య కొన్ని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో ఏసీబీ సోదాలు నిర్వహించడం, లంచాలు తీసుకుంటోన్న అధికారులను ట్రాప్ చేసింది. అయినా సబ్ రిజిస్టర్ కార్యాలయాల్లో కొనసాగుతోన్న దందాకు మాత్రం ఫుల్‌స్టాప్ పడటంలేదని విమర్శలు ఉన్నాయి. దీనితో అవినీతికి పాల్పడుతోన్న సబ్ రిజిస్టర్లను ట్రాప్ చేసి, కేసులు పెట్టాలని ప్రభుత్వం ఆదేశించినట్టు తెలుస్తున్నది. దీనితో నిఘా వర్గాలు కొన్ని రోజులుగా సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులపై ప్రత్యేకంగా ఫోకస్ పెట్టి, అక్కడ జరుగుతోన్న దందాలను ఆరా తీస్తున్నట్టు తెలిసింది. ఇప్పటికీ రిజిస్ట్రేషన్ ఆఫీసుల్లో మధ్యవర్తులు, దళారుల ప్రమేయం లేకుండా రిజిస్ట్రేషన్ జరగడం లేదు. అందుకు ఆఫీసుకు సమీపంలోని డాక్యుమెంట్ రైటర్లే సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసు పట్టుకొమ్మలుగా ఉన్నారు. వారు చెప్పినంత ముట్టచెప్తేనే డాక్యుమెంట్స్ బయటికి వస్తాయనేది బహిరంగ రహస్యం. క్యూర్ ఏరియాలోని ఒక్కో సబ్ రిజిస్టర్ ఆఫీసులో రోజుకు సగటున రూ. లక్షన్నర వరకు ముడుపుల రూపంలో వసూలు చేస్తున్నట్టు తెలుస్తున్నది. కొన్ని ఆఫీసుల్లో ఆ మొత్తం రూ. రెండు లక్షల వరకు ఉంటుందని ప్రచారం ఉంది. ఆ చోట ఈ చోట అనే తేడా లేకుండా సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులో డబ్బులు ఇవ్వకుండా ఏ ఒక్కరూ బయటికి రాలేని పరిస్థితి తయారైంది. ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో ఏసీబీ రంగంలోకి దిగేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. సమయం, సందర్భం చూసుకుని సబ్ రిజిస్ట్రేషన్ ఆఫీసులు, చుట్టుపక్కల ఉండే డాక్యుమెంట్ రైటర్ల ఆఫీసుల్లో సోదాలు నిర్వహించేందుకు ప్లాన్ చేస్తున్నట్టు తెలిసింది. ప్రధానంగా అర్బన్ ఏరియాల్లో పనిచేస్తోన్న సబ్ రిజిస్టర్ల కదలికలపై నిఘా పెట్టినట్టు సమాచారం. ఒక్కో రోజు ఎంత మొత్తంలో వసూలు చేస్తున్నారు? అందులో ఆఫీసులోని స్టాఫ్‌కు ఎంత మొత్తంలో వాటాలు ఇస్తున్నారు? అనే కోణంలో కూడా సమాచారం సేకరిస్తున్నట్టు తెలిసింది. కొందరు అధికారులు తమ సర్వీసులో అక్రమ సంపాదనతో పెద్ద ఎత్తున ఆస్తులు సమకూర్చుకున్నట్టు ప్రచారం జరుగుతున్నది. అలాంటి అధికారుల ఇళ్లను సోదాలు చేసేందుకు ఏసీబీ ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం. కొందరు సబ్ రిజిస్టర్లు, రిజిస్టర్లు తమకు నచ్చిన చోట పోస్టింగ్ ఇస్తే రూ. కోట్లు ఇచ్చేందుకు రెడీగా ఉన్నామని రూలింగ్ పార్టీ లీడర్లకు ఆఫర్లు పెట్టినట్టు తెలిసింది.

దీనితో ఆశపడిన లీడర్లు సంబంధిత శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వద్దకు వెళ్లి అసలు సంగతి వివరించినట్టు సమాచారం. అలాంటి వాటిని ఎంకరేజ్ చేసే ప్రసక్తే లేదని తెగేసి చెప్పడంతో సదరు లీడర్లు మౌనంగా వెళ్లిపోయినట్టు తెలిసింది. ఈ మధ్య జరిగిన రిజిస్ట్రేషన్ శాఖ రివ్యూలో మంత్రి సంబంధిత శాఖ అధికారులపై సీరియస్ అయినట్టు తెలిసింది. 'ఎవరెవరు పోస్టింగ్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు తెలుసు. ఎంత మొత్తంలో డబ్బులు ఇస్తామని చెప్పారో తెలుసు. వారి చిట్టా మొత్తం ఏసీబీకి పంపాను' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం.

సంపదకియం పేజీలో రచనలు పంపవలసిన వాట్సాప్ నంబర్ మెయిల్ ఐడి 9951512539
flashindia999@gmail.com

# ఎస్ఐఆర్ పై కాంగ్రెస్ వార్ రూమ్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :**

**గాంధీభవన్ లో కంట్రోల్ రూమ్**

ఎస్ఐఆర్ ప్రక్రియను గాంధీభవన్ లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ద్వారా పర్యవేక్షించేందుకు టీపీసీసీ కోఆర్డినేటర్లను నియమించింది. టీపీసీసీ ఈసీ కోఆర్డినేషన్ కమిటీ చైర్మన్ గా పులిపాటి రాజేష్ కుమార్, కోఆర్డినేటర్ గా కాంగ్రెస్ సీనియర్ నేత గంపా వేణుగోపాల్ నియమితులయ్యారు. వారితో పాటు రాష్ట్రంలోని 17 లోక్ సభ స్థానాల వారీగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ లకు కోఆర్డినేటర్లను టీపీసీసీ నియమించింది. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు లేని చోట ఇన్ చార్జీలతో పాటు పార్టీ సీనియర్ నేతను నియమించుకుని ఎస్ఐఆర్ ను సమన్వయం చేస్తున్నారని పార్టీ నేతలు తెలిపారు. ప్రతి జిల్లాకు డీసీసీ అధ్యక్షులను జిల్లా కోఆర్డినేటర్లుగా నియమించారు. వీరు న్యాయవాదిని నియమించుకుని స్థానికంగా సర్ ప్రక్రియను పర్యవేక్షిస్తున్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. గాంధీభవన్ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ ఇన్ ఛార్జ్ మీనాక్షి నటరాజన్ పర్యవేక్షించనున్నారు. క్షేత్రస్థాయిలో తమ దృష్టికి వచ్చిన అనేక సమస్యలను రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి దృష్టికి కాంగ్రెస్ ఈసీ కోఆర్డినేషన్ నేతలు తీసుకెళ్తున్నారు. ఎన్యుమరేషన్ సమయాన్ని 30 రోజులు కాకుండా 60 రోజులకు పెంచాలని, బీఎల్ఏల జాబితా తక్షణమే ఈ జాబితాను బీఎల్ఓలకు ఇవ్వాలని కోరారు. ఆన్‌లైన్ ఎన్యుమరేషన్ ప్రాసెస్‌లో ఈ–సైన్ తప్పనిసరి అని, దానికోసం ఆధార్ అనుసంధానం పెద్ద అడ్డంకిని సృష్టిస్తోందన్నారు. ఆధార్ తో కాకుండా పాస్ పోర్ట్, ఇతర స్వీయ ధ్రువీకరణ పత్రాలు జత చేసే వెసులుబాటు ఇవ్వాలని సీఈవోను కలిసి నేతలు విజ్ఞప్తి చేశారు.



రాష్ట్రంలో ఓటరు జాబితా సమగ్ర ప్రక్షాళన(ఎస్ఐఆర్) ప్రక్రియను అధికార కాంగ్రెస్ పార్టీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకున్నది. ఇప్పటికే ఏఐసీసీ ఆయా రాష్ట్రాల్లో జరిగిన సర్ పైన పార్టీపరంగా అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ పలు కార్యక్రమాలు చేపట్టింది. బీహార్, పశ్చిమ బెంగాల్ రాష్ట్రంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నిరసన గళం వినిపించారు. ప్రతి బూత్ లోనూ బీఎల్ఏ, బీఎల్ఏ 2 పాత్ర కీలకమైనందున వారికి అసెంబ్లీ, పార్లమెంట్ పరిధిలో ట్రైనింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శిక్షణ కార్యక్రమాల్లో టీపీసీసీ చీఫ్, మీనాక్షి నటరాజన్ జూన్ 21న మక్తల్, 23న ఆందోల్ నియోజకవర్గాల్లో పాల్గొన్న విషయం తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 35,958 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని, కాంగ్రెస్ పార్టీపరంగా 35,200 బీఎల్ఏలను నియమించామని పార్టీనేతలు వెల్లడించారు.

# మంత్రి శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవ..

## రూ. 15 కోట్లతో రోడ్డు విస్తరణతో పాటు డ్రైనేజ్ నిర్మాణం

**మంథని,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ఐటి పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ప్రత్యేక చొరవతో మంథని టౌన్ మాస్టర్ ప్లాన్ తో పట్టణ రూపు రేఖలు మారనున్నాయి. మంథని పట్టణ అభివృద్ధితో పాటు సుందరికరణకు సర్వం సిద్ధం అవుతుంది. దీంతో మంథని పట్టణం కరీంనగర్ లాంటి సిటీని తలపించే విధంగా మారనుంది. ఇప్పటికే మంత్రి శ్రీధర్ బాబు మంథని పట్టణంతో పాటు నియోజకవర్గ అభివృద్ధి కొరకు కోట్లాది రూపాయల నిధులను కేటాయించారు. ఇప్పటికే పలు అభివృద్ధి పనులు పూర్తి అయ్యాయి. కొన్ని చివర దశకు చేరుకున్నాయి. మరి కొన్ని నిర్మాణంలో ఉన్నాయి. దింతో మంథని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



**15 కోట్లు... రోడ్డు విస్తరణ డ్రైనేజ్ నిర్మాణం**

పట్టణంలోని ఆర్టీసీ బస్సు డిపో నుండి పాత పెట్రోల్ బాంక్ వరకు రోడ్డుకు ఇరు వైపులా 100 పిట్లతో రోడ్డు వేడెల్పుతో పాటు డ్రైనేజ్ నిర్మాణం చేయనున్నారు. దీనికి కొరకు ఇప్పటికే డిఎంఎఫ్టి ఆర్‌డబి నిధులతో 15 కోట్లతో అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికె మున్సిపల్ పరిధిలో ఉన్న 18 షాపుల వ్యాపారులు, 12 జిపీ కాంప్లెక్స్ వ్యాపారులతో పాటు మెయిన్ రోడ్డు మీద పండ్ల వ్యాపారులు స్వచ్ఛందంగా షాపు ముందు ఉన్న రేకులను తొలగిస్తున్నారు. అయితే రెండు నెలల్లో రోడ్డు తో పాటు డ్రైనేజ్ నిర్మాణం పూర్తి కానుంది. ఇదే కాక డిపో, పెట్రోల్ బాంక్ తో పాటు విగ్రహల దగ్గర జంక్షన్ల వేడెల్పు ఇప్లిమెంట్ చేయనున్నారు. దీంతో మంథని పట్టణం మోడల్ సిటీ గా మారనుంది.

**6.40 కోట్లతో వెజ్ నాన్ వెజ్ నిర్మాణం..**


పట్టణంలో ఉన్న పాత కూరగాయల మార్కెట్‌ను కూల్చివేశారు. దాని స్థానంలో 6.40 కోట్లతో వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ను నిర్మించనున్నారు. జీ1 తో షాపింగ్ కాంప్లెక్స్ తో పాటు కూరగాయల మార్కెట్ నిర్మించనున్నారు. సంవత్సరం తర్వాత వెజ్ నాన్ వెజ్ మార్కెట్ ప్రజలకు వ్యాపారులకు అందుబాటులోకి రానుంది.

**మోడల్ టౌన్‌కు సర్వం సిద్ధం...**

అయితే మంథనిని రాష్ట్రంలో మంథని పట్టణంను మోడల్ టౌన్ గా తీర్చిదిద్దుతానని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పలు సందర్భల్లో చెప్పారు. దీంతో ఇప్పటికే మంథని పట్టణంలో మున్సిపల్ ఆఫీస్, ప్రభుత్వ ఆసుపత్రి, సమీకృత ఆర్డీఓ కార్యాలయం, వెజ్ నాన్ వెజ్ మార్కెట్ నిర్మాణం, పట్టణంలో రోడ్డు వేడెల్పు, కుల సంఘాల భవనాలతో పాటు మరిన్ని అభివృద్ధి పనులకు పట్టణంలో కోట్లాది రూపాయల నిదులు కేటాయించారు. అయితే నియోజకవర్గం కేంద్రం అయిన ఇప్పుడు మంథని పట్టణంగా ఉంది. దీంతో పట్టణం రాష్టములోనే మోడల్ టౌన్ సిటీగా మారనుంది. దీంతో త్వరలో మంథని జిల్లా కొరకు అడుగులు పడుతున్నట్లు మేధావులు, రాజకీయ విశ్లేషకులు, విద్యార్థి సంఘాలు, ప్రజా సంఘాలు, నియోజకవర్గ ప్రజల నుండి అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ఇది మంత్రి శ్రీధర్ బాబుతోనే సాధ్యం అంటున్నారు నియోజకవర్గం ప్రజలు.

# నేడు, రేపు రిజిస్ట్రేషన్లు బంద్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ వ్యాప్తంగా భూములు, ఇళ్లు, ఇతర ఆస్తుల కొనుగోలుదారులకు ఓ బ్యాడ్ న్యూస్. రాష్ట్రంలో నేడు, రేపు అన్ని రకాల ఆస్తి రిజిస్ట్రేషన్ల సేవలు పూర్తిగా నిలిచిపోనున్నాయి. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖకు సంబంధించిన కేంద్రీకృత కంప్యూటర్ సర్వర్ల ఆధునికీకరణ , అలాగే కొత్త సాంకేతిక వ్యవస్థల అనుసంధాన ప్రక్రియ ఇంకా కొనసాగుతుండటమే ఇందుకు ప్రధాన కారణమని ఉన్నతాధికారులు వెల్లడించారు. గురువారం సాయంత్రం నాటికి ఈ సాంకేతిక పనులన్నీ విజయవంతంగా పూర్తవుతాయని, ఆ తర్వాతే ఆన్‌లైన్ సేవలను, స్లాట్ బుకింగ్స్‌ను తిరిగి ప్రజలకు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువస్తామని రిజిస్ట్రేషన్ శాఖ వర్గాలు స్పష్టం చేశాయి. ఈ సాంకేతిక మార్పులు, సర్వర్ మెయింటెనెన్స్ పనుల కారణంగా గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ తీవ్రంగా ప్రభావితమైంది. గత ఏడు రోజుల్లోనే ఇప్పటికే మూడు రోజుల పాటు రిజిస్ట్రేషన్ సేవలు పూర్తిగా నిలిచిపోవడంతో సబ్–రిజిస్ట్రార్ ఆఫీసుల్లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ముఖ్యంగా సోమవారం మధ్యాహ్నం నుంచే సర్వర్లు పూర్తిగా డౌన్ కావడంతో కొనుగోలు, అమ్మకాలకు సంబంధించిన అన్ని రకాల ఆస్తి రిజిస్ట్రేషన్ సేవలు పెండింగ్‌లో పడిపోయాయి. దీనివల్ల సుదూర ప్రాంతాల నుంచి రిజిస్ట్రేషన్ల కోసం, స్లాట్లు బుక్ చేసుకుని కార్యాలయాలకు వచ్చిన వందలాది మంది ప్రజలు, డాక్యుమెంట్ రైటర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సర్వర్లు నిలిచిపోవడంతో అటు ప్రజలకు ఇబ్బందులు కలగడమే కాకుండా, ఇటు ప్రభుత్వ ఖజానాకు కూడా రోజువారీగా వచ్చే కోట్లాది రూపాయల ఆదాయానికి గండి పడుతోంది. అయితే, భవిష్యత్తులో ఆన్‌లైన్ లావాదేవీలు మరింత వేగంగా, ఎలాంటి సాంకేతిక అంతరాయాలు లేకుండా సాగడం కోసమే ఈ ఆధునికీకరణ ప్రక్రియను చేపట్టినట్లు అధికారులు



పేర్కొన్నారు. గురువారం సాయంత్రం పనులు పూర్తయిన తర్వాత, శుక్రవారం ఉదయం నుంచి యథావిధిగా స్లాట్లు బుక్ చేసుకున్న వారందరికీ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను వేగవంతం చేస్తామని, పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా త్వరగా పరిష్కరిస్తామని రిజిస్ట్రేషన్ల శాఖ అధికారులు పౌరులకు విజ్ఞప్తి చేశారు.

# సమగ్ర నెట్‌వర్క్ మ్యాపింగ్

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** వినియోగదారులకు మరింత వేగవంతమైన, పారదర్శకమైన విద్యుత్ సేవలందించేందుకు తెలంగాణ సదరన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (టీజీఎస్పీడీసీఎల్) సరికొత్త సాంకేతిక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. జులై 1వ తేదీ నుంచి తన పరిధి వ్యాప్తంగా సమగ్ర విద్యుత్ నెట్‌వర్క్ మ్యాపింగ్ డ్రైవ్‌ను ప్రారంభించనుంది. తొలి దశలో ఈ కార్యక్రమాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో అమలు చేయనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ మార్గదర్శకత్వంలో టీజీఎస్పీడీసీఎల్ సీఎండీ జితిష్ వి.పాటిల్ ఈ వినూత్న డ్రైవ్‌ను పర్యవేక్షిస్తున్నారు.

**ప్రతి కనెక్షన్ డిజిటల్ మ్యాపింగ్..**

ఈ డ్రైవ్ ద్వారా 132/33 కేవీ ఈహెచ్‌టీ సబ్‌స్టేషన్ల నుంచి పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లు (డీటీఆర్‌లు), చివరకు ప్రతి వినియోగదారుడి సర్వీస్ కనెక్షన్ వరకు పూర్తి విద్యుత్ నెట్‌వర్క్ అనుసంధానాన్ని డిజిటల్ రూపంలో నమోదు చేస్తారు. జులై నెల బిల్లింగ్ ప్రక్రియలో భాగంగా మీటర్ రీడర్లు క్షేత్రస్థాయిలో ప్రతి డీటీఆర్‌ను సందర్శించి, ఆయా ట్రాన్స్‌ఫార్మర్లకు అనుసంధానమైన వినియోగదారుల సర్వీసులను ఖచ్చితంగా మ్యాపింగ్ చేయనున్నారు. విద్యుత్ అంతరాయం ఏర్పడినప్పుడు సమస్య ఫీడర్ స్థాయిలో ఉందా, ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఉందా లేదా వ్యక్తిగత కనెక్షన్‌లో ఉందా? అనేది వ్యవస్థ ఈజీగా గుర్తిస్తుంది.

**ఫిర్యాదు చేసిన వెంటనే వివరాలు..**

1912 కాల్ సెంటర్, మొబైల్ యాప్ లేదా వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేసిన వెంటనే.. సరఫరా నిలిచిపోవడానికి గల కారణాలు, పునరుద్ధరణకు పట్టే సమయాన్ని వినియోగదారులు సులభంగా తెలుసుకోవచ్చు. స్మార్ట్ గ్రిడ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత అవుటేజ్ మేనేజ్‌మెంట్ వంటి ఆధునిక వ్యవస్థల అమలుకు ఈ డేటా బలమైన పునాదిగా నిలుస్తుంది. విద్యుత్ పంపిణీ వ్యవస్థలో డిజిటలైజేషన్‌ను విస్తృతంగా వినియోగించడం ద్వారా వినియోగదారులకు నమ్మకమైన సేవలను అందించడమే మా లక్ష్యం. ఈ సమగ్ర నెట్‌వర్క్ మ్యాపింగ్ భవిష్యత్ విద్యుత్ రంగానికి మైలురాయిగా నిలుస్తుంది.

# రాముని బాటలో కాంగ్రెస్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రాముడి ఆదర్శాల బాటలో నడుస్తూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తోందని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి కొనియాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం అన్ని ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి, సర్వజన సంక్షేమానికి అహర్నిశలు కృషి చేస్తూ ప్రజా మన్ననలు పొందుతోందని ఆయన స్పష్టం చేశారు. ప్రజాదరణతో దూసుకుపోతున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని విమర్శించడం బీజేపీ నాయకుల మూర్ఖత్వానికి నిదర్శనమని మండిపడ్డారు. దేశంలో, రాష్ట్రంలో బీజేపీ అత్యంత అవినీతి, అక్రమాలు, నియంతృత్వ ధోరణులతో ఒక రావణాసుర పాలనను సాగిస్తోందని, అలాంటి మత రాజకీయాలు చేసే పార్టీకి తెలంగాణలో ఎంతమాత్రం అవకాశం లేదని ఆయన తేల్చిచెప్పారు. ఇటీవల తెలంగాణలో మూడు రోజుల పాటు పర్యటించిన బీజేపీ జాతీయ నేత నితిన్ నబీన్ పర్యటన ఒక 'అట్టర్ ఫ్లాప్ షో' గా ముగిసిందని మల్లు రవి ఎద్దేవా చేశారు. తెలంగాణను కాంగ్రెస్ ముక్త్ రాష్ట్రంగా మారుస్తామంటూ నితిన్ నబీన్ చేసిన ప్రగల్భాలపై ఆయన తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీని గద్దె దించడం బీజేపీ వల్ల కాదు కదా.. ఎవరి వల్లా కాదని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడ అధికారంలోకి వస్తామని బీజేపీ పగటి కలలు కంటోందని, తెలంగాణ సమాజం మత విద్వేష రాజకీయాలను ఎప్పుడూ ఆదరించదని స్పష్టం చేశారు. రేవంత్ ఆధ్వర్యంలో రాముని బాటలో నడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కొనే సత్తా, దమ్ము బీజేపీకి లేవని, క్షేత్రస్థాయిలో ఉనికి కోసమే ఆ పార్టీ నేతలు ఆరాటపడుతున్నారని విమర్శించారు.

**బీజేపీ ముక్త్ భారత్ ఖాయం**

అయోధ్య రామమందిరం అంశంపై బీజేపీపై మల్లు రవి తీవ్రమైన ఆరోపణలు చేశారు. గత 40 ఏళ్లుగా అయోధ్య రాముడి పేరు చెప్పుకుని పబ్బం గడుపుకుంటున్న బీజేపీ.. చివరకు ఆ దేవుడి సొమ్మును కూడా వదలకుండా దిగమింగిందని ధ్వజమెత్తారు. పాప భీతి, దైవ భక్తి లేకుండా దేవుడి పైసలనే మింగేసిన బీజేపీకి దేశంలో ఇక పుట్టగతులు ఉండవని, త్వరలోనే దేశం 'బీజేపీ ముక్త్ భారత్' కావడం ఖాయమని జోస్యం చెప్పారు. స్వయంగా బీజేపీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్ లోని అయోధ్యలోనే ఆ పార్టీ అవినీతిపై అక్కడి ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని, దేశంలో బీజేపీకి కాలం చెల్లిందని అయోధ్య వాసులే స్వయంగా అంటున్నారని పేర్కొన్నారు. ప్రజలను మోసం చేస్తూ, విభజన రాజకీయాలతో ఎంతో కాలం పాలన సాగించలేరని, రాబోయే సార్వత్రిక ఎన్నికలే బీజేపీకి చివరి ఎన్నికలు కాబోతున్నాయని మల్లు రవి హెచ్చరించారు. అవినీతి, అక్రమాలతో సాగుతున్న రావణ కాష్టానికి ప్రజలు త్వరలోనే చరమగీతం పాడనున్నారని స్పష్టం చేశారు. రాబోయే కాలంలో దేశవ్యాప్తంగా కాంగ్రెస్ గాలి వీయడం ఖాయమని, కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజారిటీతో అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో దేశ ప్రధాని పీఠాన్ని రాహుల్ గాంధీ అధిరోహించడం ఖాయమని, ప్రజాస్వామ్య పునరుద్ధరణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని ఎంపీ మల్లు రవి స్పష్టం చేశారు.



# అందుకే సభకు వెళ్లలేదు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యవహారశైలిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ మునుగోడు కాంగ్రెస్ ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి ఒక టీవీ ఛానల్ లైవ్ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. పార్టీ కోసం మొదటి నుంచి పనిచేసిన ఒరిజినల్ కాంగ్రెస్ నాయకులు రోజురోజుకూ కనుమరుగవుతున్నారని, ఎక్కడెక్కడి నుంచో వచ్చిన కొత్తవాళ్ల హవానే ఇప్పుడు నడుస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వంలో "షో అప్స్" (ఆడంబరాలు) ఎక్కువయ్యాయని, ముఖ్యమంత్రి ఒంటెద్దు పోకడలు అస్సలు బాలేవంటూ రాజగోపాల్ రెడ్డి ఘాటుగా విమర్శించారు.

**యాదగిరిగుట్ట బోర్డు వివాదం.. అందుకే సభకు వెళ్లలేదు**

యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయ ధర్మకర్తల మండలి (ట్రస్ట్ బోర్డు) నియామకంపై స్థానిక సీనియర్ నేతగా, ఎమ్మెల్యేగా ఉన్న తనకు కనీస సమాచారం కూడా ఇవ్వకపోవడంపై రాజగోపాల్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "నేను సీనియర్ నాయకుడిని, ఇక్కడి ఎమ్మెల్యేని.. నాకే సమాచారం ఇవ్వకపోతే ఎలా?" అని ప్రశ్నించారు. ఈ నియామకాలు, సీఎం వ్యవహారశైలి నచ్చకనే తాను ఇటీవల నిర్వహించిన నల్లగొండ బహిరంగ సభకు హాజరు కాకుండా దూరంగా ఉన్నట్లు ఆయన బహిరంగంగానే స్పష్టం చేశారు. రాజగోపాల్ రెడ్డి చేసిన ఈ హాట్ కామెంట్స్ ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో, ముఖ్యంగా కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి.

# సిట్ పరిధి, గడువు పెంపు

**న్యూ ఢిల్లీ :** అయోధ్య శ్రీరామ జన్మభూమి ఆలయ విరాళాల దుర్వినియోగం కేసు దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన విషయం తెలిసిందే. అయితే ఈ అక్రమ ఆరోపణలపై దర్యాప్తు చేసేందుకు ప్రత్యేక విచారణ బృందానికి నేటితో సమయం ముగిసింది. దీంతో ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం మరో 15 రోజుల అదనపు గడువు పొడిగించింది. అలాగే ఈ కేసులో అన్ని కోణాలను క్షుణ్ణంగా పరిశీలించేందుకు, దర్యాప్తు పరిధిని మరింత విస్తృతం చేసేందుకు వీలుగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. ఈ స్కామ్‌లో ఎంతటి వారున్నా వదిలిపెట్టేది లేదని, ప్రతి ఒక్క కోణాన్ని నిష్పక్షపాతంగా విచారించనున్నట్లు ఎస్ఐటీ స్పష్టం చేసింది.

**పోలీస్ కస్టడీలో నిందితులు - ట్రస్ట్ నిర్వాహకుల రాజీనామా**

ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే యూపీ పోలీసులు తీవ్రస్థాయిలో దర్యాప్తు చేపట్టి ఎనిమిది మంది నిందితులను అరెస్ట్ చేయగా, అయోధ్య కోర్టు వారికి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. కాగా, ఈ నిధుల అవకతవకల ఆరోపణలపై నైతిక బాధ్యత వహిస్తూ శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, సభ్య ట్రస్టీ అనిల్ మిశ్రా ఇప్పటికే తమ పదవులకు రాజీనామా చేశారు. అనంతరం పోలీసులు చంపత్ రాయ్‌ను సుదీర్ఘంగా ప్రశ్నించి ఆయన స్టేట్‌మెంట్‌ను కూడా రికార్డ్ చేశారు. నిందితుల ఇళ్లలో జరిపిన సోదాల్లో దాదాపు రూ.80 లక్షల నగదును కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. విచారణ పరిధి ఇప్పుడు బ్యాంకింగ్ లావాదేవీల వైపు కూడా విస్తరించడంతో ఈ 15 రోజుల అదనపు గడువులో సిట్ మరిన్ని కీలక నిజాలను వెలుగులోకి తెచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.



# ప్రీ ప్రైమరీ–అంగన్వాడీ పోరు..

**తలకొండపల్లి,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర ప్రభుత్వ విద్యా సంస్కరణల్లో భాగంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన ప్రీ ప్రైమరీ పాఠశాలల విధానం గ్రామీణ ప్రాంతాల్లో కొత్త ఆశలు రేకెత్తించినప్పటికీ, స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోవడంతో ప్రస్తుతం గందరగోళానికి దారితీస్తోంది. ముఖ్యంగా తలకొండపల్లి మండలంలోని చుక్కాపూర్ గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలు, ప్రీ ప్రైమరీ పాఠశాలల మధ్య విద్యార్థుల చేరికల అంశం వివాదాస్పదంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుండగా, స్థానిక ఎమ్మెల్యే చొరవతో ఖానాపూర్ గ్రామ శివారులో రూ.200 కోట్ల వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణం కొనసాగుతోంది. అదేవిధంగా వెల్జాల్ గ్రామానికి తెలంగాణ పబ్లిక్ స్కూల్ ను మంజూరు చేశారు. ఇదే క్రమంలో చుక్కాపూర్ గ్రామానికి గత ఏడాది ప్రత్యేకంగా ప్రీప్రైమరీ పాఠశాల మంజూరు చేసి ప్రారంభించారు. ఈ విద్యా సంవత్సరంలో కూడా ఇటీవల తలకొండపల్లి, గట్టు ఇప్పలపల్లి, పడకల్, వెల్జాల్ గ్రామాలకు కూడా కొత్త ప్రీ ప్రైమరీ పాఠశాలలు మంజూరయ్యాయి.

**చేరికలపై స్పష్టత లేక తల్లిదండ్రుల ఆందళన**

అయితే 3 నుంచి 5 సంవత్సరాల పిల్లలను ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో చేర్చాలా? లేక 3 నుంచి 4 సంవత్సరాల పిల్లలు అంగన్వాడి కేంద్రాల్లోనే కొనసాగాలా? అనే విషయంలో స్పష్టత లేక తల్లిదండ్రులు తీవ్ర అయోమయంలో ఉన్నారు. గ్రామాల్లో అంగన్వాడి సిబ్బంది ఒకవైపు, ప్రీ ప్రైమరీ సిబ్బంది మరోవైపు తమ తమ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని ఒత్తిడి తీసుకురావడం పరిస్థితిని మరింత క్లిష్టతరం చేస్తోంది.

**పిల్లల తల్లిదండ్రులు గందరగోళంలో...**

అంగన్వాడి కేంద్రాల్లో గర్భిణీల నమోదు నుంచి చిన్నారులకు పౌష్టికాహారం, బాలామృతం, గుడ్లు వంటి సౌకర్యాలు అందుతున్నాయి. మరోవైపు ప్రీ ప్రైమరీ పాఠశాలల్లో ఆధునిక సదుపాయాలు, ప్రత్యేక బోధన అందిస్తామని అధికారులు చెబుతున్నారు. దీంతో ఏ పాఠశాల పిల్లల భవిష్యత్తుకు అనుకూలమో తల్లిదండ్రులు నిర్ణయించలేకపోతున్నారు.

**గైడెన్స్ లేక ప్రభుత్వ లక్ష్యానికే దెబ్బ**

ప్రభుత్వం లక్షల రూపాయలు ఖర్చు చేసి ప్రీ ప్రైమరీ పాఠశాలలకు ఫర్నిచర్, విద్యా సామగ్రి, సిబ్బందిని ఏర్పాటు చేసినప్పటికీ, స్పష్టమైన మార్గదర్శకాలు లేకపోతే ఆ లక్ష్యం నెరవేరే అవకాశాలు కనిపించడం లేదని గ్రామస్థులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా ప్రైవేట్ పాఠశాలల వైపు వెళ్తున్న చిన్నారులను ప్రభుత్వ ప్రీ ప్రైమరీ పాఠశాలల వైపు ఆకర్షించాలంటే ముందుగా చేరికలపై స్పష్టత అవసరమని చెబుతున్నారు.

**జిల్లా అధికారులు వెంటనే స్పందించాలి**

ఈ పరిస్థితుల నేపథ్యంలో జిల్లా కలెక్టర్, విద్యాశాఖ అధికారులు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు సంయుక్తంగా స్పష్టమైన గైడెన్స్ విడుదల చేసి గ్రామాల్లో నెలకొన్న అయోమయానికి తెరదించాలని తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, విద్యావేత్తలు కోరుతున్నారు. లేనిపక్షంలో ప్రభుత్వ వ్యవస్థ అమలుపై ప్రజల్లో మరింత గందరగోళం నెలకొనే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



**సూర్యాపేట, ఫ్లాష్ ఇండియా :** ప్రాథమిక పాఠశాల అర్వపల్లి మండలం జాజిరెడ్డి గూడెం గ్రామ నివాసి శివ సాయి మార్కెటింగ్ సోలార్ ఎనర్జీస్ అధినేత శ్రీ బుద్దా శ్రీనివాస్ గుప్త గారు తన కుమార్తె శ్రీవల్లి దేవసేన గారి పుట్టినరోజు సందర్భంగా సుమారు 8వేల రూపాయల విలువైన నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు పాఠశాల విద్యార్థులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమం లో మండల విద్యాధికారి బాలు నాయక్ గారు, గ్రామ సర్పంచ్ చిల్లంచర్ల విద్యాసాగర్ గారు, పాఠశాల చైర్మన్ మేకల సునిత రాంబాబు గారు మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బత్తిని స్వరూపారాణి గారు మరియు ఉపాధ్యాయినిలు ఎన్.శైలజ కే. రేణుకలు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



**షాద్ నగర్,ఫ్లాష్ ఇండియా :** గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని, ప్రజలకు అవసరమైన ప్రతి పనిని దశలవారీగా పూర్తిచేస్తామని షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. కొందుర్గు మండలం టేకులపల్లి గ్రామంలో బుధవారం పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు సేవా కేంద్రాన్ని ప్రారంభించి, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రూ. 5 లక్షల భయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామంలో నిర్వహిస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...

**అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలి..**

రైతుల అభివృద్ధి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, రైతులకు ఒకే చోటసేవలను అందించేందుకు రైతు సేవ కేంద్రాలు ఉపయోగపడతాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని, రహదారుల నిర్మాణంతో రవాణా సౌకర్యాలు మెరుగుపడతాయని, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి దోహద పడతాయని అన్నారు. ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని ఓటు అని, ఓటు హక్కు కలిగిన ప్రతి

ఒక్కరు ఓటరూ జాబితాలో తమ ఓటు ఉందో లేదో ఎస్ఐఆర్ ప్రక్రియలో పరిశీలించుకోవాలని సూచించారు. ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని, అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సికింద్రాబాద్‌లో టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ

**సీతాఫల్‌మండి,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఉద్యమ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు పొందిన సికింద్రాబాద్‌లో టీఆర్ఎస్ పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. సికింద్రాబాద్ ఇన్‌చార్జి బండారి మహేందర్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చిలకలగూడ గాంధీ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సీతాఫల్‌మండి చౌరస్తా నుంచి చిలకలగూడ వరకు నిర్వహించిన భారీ ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డప్పు వాయిద్యాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, మహిళల హారతులు, పూల వర్షం మధ్య కవితకు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సభలో కల్వకుంట్ల కవిత మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన ప్రజల ఆకాంక్షల నెరవేర్పు కోసమే జరిగిందని, అయితే ఇంకా అనేక వర్గాల ప్రజలు ఆశించిన ఫలితాలను పూర్తిస్థాయిలో అందుకోలేకపోయారని అన్నారు. గత ప్రభుత్వాలు ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలమయ్యాయని విమర్శించారు. ప్రజల జీవన ప్రమాణాల మెరుగుదలే తమ పార్టీ ప్రధాన లక్ష్యమని పేర్కొన్న ఆమె, అధికారంలోకి వచ్చిన వెంటనే ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే ప్రతి కుటుంబానికి నాణ్యమైన ఉచిత వైద్య సేవలు అందించే విధానాన్ని అమలు చేస్తామని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల స్థలం కేటాయించే వరకు పోరాటం కొనసాగిస్తామని, ఉద్యమకారులకు ప్రత్యేక గుర్తింపు, గౌరవం కల్పించేందుకు కట్టుబడి ఉంటామని కవిత స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన సికింద్రాబాద్ ప్రాంతానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్న ఆమె, ప్రజా సమస్యల పరిష్కారంలో బండారి మహేందర్ ముదిరాజ్ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా నాయకురాలు ధరణి, యువ నాయకుడు సిద్ధార్థ్ బండారి, నాయకులు శ్రీకాంత్, ఫణీంద్ర, వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు విశేషంగా కృషి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ ఉద్యమానికి ఊపిరిగా నిలిచిన సికింద్రాబాద్‌లో నిర్వహించిన ఈ జెండా ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కొత్త రాజకీయ ప్రత్యామ్నాయాన్ని నిర్మించేందుకు కృషి చేస్తున్నామని పార్టీ నాయకులు పేర్కొన్నారు.

# నేడు రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్...



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఫీజు రీయంబర్స్మెంట్ బకాయిలన్నింటినీ విడుదల చేయాలని కోరుతూ ఈ నెల 2న బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కాలేజీల బంద్ నిర్వహిస్తున్నట్లు జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మిర్యాలగూడ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడు బడ్జెట్ లు ప్రవేశపెట్టినప్పటికీ రాష్ట్రంలోని 14 లక్షల మంది పేద ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ విద్యార్థులకు రావలసిన ఎనిమిది వేల కోట్ల ఫీజుల బకాయిలను విడుదల చేయకుండా పేద విద్యార్థులను ఉన్నత విద్య నుండి దూరం చేయాలని కుట్ర చేస్తుందని ఆయన ఆరోపించారు. ప్రభుత్వం ఆదాయం అంతా బడాబడా కాంట్రాక్టర్లకు దోచిపెడుతుందని ఆయన మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బంటు వెంకటేశ్వర్లు,సమీర్,రాంబాబు యాదవ్ మీనాక్షి,మనీచందు,కీర్తన, అయాజ్,మహిమ,యోగేశ్వర్, శ్రీనివాస్ నాగరాణి,కార్తీక్,తేజశ్రీ, శివశంకర్,శివాలోకేష్,మేఘన తదితరులు పాల్గొన్నారు.

# సర్ ప్రక్రియను విజయవంతం చేయాలి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** మిర్యాలగూడ ఈఆర్ఓ (ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి) మరియు మిర్యాలగూడ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డిఓ) ఎస్.రమణారెడ్డి వారి ఆర్‌డీఓ కార్యాలయంలో ప్రత్యేక ముమ్మర సవరణ (సర్) కార్యక్రమంపై అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో బుధవారం ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఓటర్ల జాబితా తయారీ (ఎన్యుమరేషన్) ప్రక్రియను సంబంధిత ప్రతినిధులందరికీ వివరించారు. అంతేకాకుండా ఈ ప్రత్యేక ముమ్మర సవరణ ప్రక్రియ విజయవంతం కావడానికి పూర్తి సహకారం అందించాలని అన్ని రాజకీయ పార్టీలకు సూచించారు.

# సీఎం రేవంత్ రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలి



**మిడ్జిల్,ఫ్లాష్ ఇండియా :** జూలై 4న మిడ్జిల్ మండల కేంద్రంలో నిర్వహించనున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందన సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మిడ్జిల్ మండల కేంద్రంలో సీఎం సభా స్థలం, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, ధ్యాప గోపాల్ రెడ్డి విగ్రహాల దిమ్మెల నిర్మాణ పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఏర్పాట్లను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. 2006లో మిడ్జిల్ మండలం నుంచి జడ్పీటీసీ సభ్యుడిగా రేవంత్ రెడ్డి తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారని గుర్తు చేశారు. ఆ స్థాయి నుంచి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎదిగే ప్రయాణంలో మిడ్జిల్ మండల ప్రజల ఆదరణ, ఆశీర్వాదాలు కీలక పాత్ర పోషించాయని ముఖ్యమంత్రి అనేక సందర్భాల్లో స్వయంగా పేర్కొన్నారని తెలిపారు. మిడ్జిల్ ప్రజలపై ఉన్న కృతజ్ఞతాభావంతోనే ముఖ్యమంత్రి జూలై 4న మండల కేంద్రానికి విచ్చేస్తున్నారని చెప్పారు. ఈ సందర్భంగా ఉమ్మడి మిడ్జిల్ మండల అభివృద్ధికి భారీ స్థాయిలో నిధులు మంజూరు చేయడంతో పాటు పలు కీలక అభివృద్ధి కార్యక్రమాలను ప్రకటించే అవకాశం ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. జూలై 4న నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# చిరుతపులి సంచారం కలకలం



**గూడూరు,ఫ్లాష్ ఇండియా :** గూడూరు మండలంలోని మర్రిమిట్ట శివారులో చిరుతపులి సంచరిస్తున్నట్లు సమాచారం రావడంతో అటవీశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. మండల ప్రజలు, ముఖ్యంగా అటవీ ప్రాంతానికి ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గూడూరు రేంజ్ అటవీశాఖ అధికారి ప్రసాదరావు సూచించారు. మంగళవారం రాత్రి మర్రిమిట్ట శివారులోని తోట దస్రు తండా సమీపంలోని మామిడి తోట వైపు చిరుత సంచరిస్తున్నట్లు గ్రామస్థులు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారులు సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. రాత్రి సమయం కావడంతో స్పష్టమైన ఆనవాళ్లు లభించకపోవడంతో అధికారులు గ్రామంలోనే ఉండి పరిస్థితిని పర్యవేక్షించారు. బుధవారం ఉదయం గ్రామస్థులు, పోలీసులు, అటవీశాఖ సిబ్బంది కలిసి అనుమానిత ప్రాంతమైన మామిడి తోటతో పాటు పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అయితే రాత్రి, తెల్లవారుజామున కురిసిన వర్షం కారణంగా ఎలాంటి పాదముద్రలు లేదా ఇతర ఆనవాళ్లు గుర్తించలేకపోయామని అటవీశాఖ అధికారి ప్రసాదరావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్థులతో మాట్లాడిన ఆయన, చిరుతపులికి సంబంధించిన ఆనవాళ్లు కనిపించినా లేదా సంచారం గుర్తించినా వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. జంతువుకు ఎలాంటి హాని తలపెట్టే ప్రయత్నం చేయవద్దని విజ్ఞప్తి చేశారు. అటవీ ప్రాంతాలకు ఆనుకుని ఉన్న గ్రామాల ప్రజలు అప్రవత్తంగా ఉండాలని, ఒంటరిగా బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అలాగే వ్యవసాయ బావుల వద్దకు వెళ్లేవారు, అడవికి సమీప ప్రాంతాల్లో పశువులను మేపేవారు ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని అటవీశాఖ అధికారులు హెచ్చరించారు.



# ప్రజా సంక్షేమమే రేవంత్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యం

**గంగాధర,ఫ్లాష్ ఇండియా :** ప్రజా సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. బుధవారం గంగాధర మండలం మధురానగర్‌లో రూ.30 లక్షల వ్యయంతో ఆధునికీకరించిన ఆర్టీసీ బస్టాండ్‌ను ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో ఆర్టీసీ వ్యవస్థను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. అప్పట్లో గంగాధర బస్టాండ్ అధ్వానంగా మారి, కనీసం బస్సులు కూడా లోపలికి రాలేని పరిస్థితి ఉండేదని గుర్తు చేశారు.

తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన వెంటనే ప్రత్యేక చొరవ తీసుకుని బస్టాండ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయించినట్లు తెలిపారు. బస్టాండ్ పరిసరాల్లో నూతన సీసీ రోడ్లు, ప్రయాణికులు కూర్చునేందుకు ఆధునిక సీటింగ్ సౌకర్యం, మరుగుదొడ్లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇకపై ప్రతి ఆర్టీసీ బస్సు తప్పనిసరిగా బస్టాండ్‌లోపలికి వచ్చేలా అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ విద్యాసంవత్సరం నుంచే గంగాధర మండలానికి చెందిన విద్యార్థుల సౌకర్యార్థం బస్టాండ్ ప్రాంగణంలో బస్‌పాస్ కౌంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. దీంతో విద్యార్థులు బస్‌పాస్ కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు.

రానున్న రోజుల్లో గంగాధర నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ డిప్యూటీ రీజినల్ మేనేజర్ భూపతిరెడ్డి, డిపో మేనేజర్ విజయ మాధురి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మంత్రి మహేందర్, సింగిల్ విండో చైర్మన్ వెలిచాల తిర్మల్‌రావు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు ముద్దం నగేష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తోట కరుణాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# విమర్శకులకు అశ్విన్ స్ట్రాంగ్ కౌంటర్!

యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఐర్లాండ్ టీ20 సిరీస్‌లో తుది జట్టులోకి తీసుకోకపోవడాన్ని టీమిండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ సమర్థించాడు. అదే సమయంలో తనపై వస్తున్న విమర్శలకు గట్టిగా కౌంటర్ ఇచ్చాడు. 15 ఏళ్ల కుర్రాడు సీనియర్ ఆటగాళ్లకు వాటర్ బాటిళ్లు అందిస్తూ (డ్రింక్స్ మోస్తూ), డ్రెస్సింగ్ రూమ్ వాతావరణాన్ని అలవాటు చేసుకోవడంలో తప్పేముందని ప్రశ్నించాడు. ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన చేయడమే కాకుండా, ఆ తర్వాత శ్రీలంకలో జరిగిన త్రైపాక్షిక సిరీస్‌లో ఇండియా-ఏ తరఫున లిస్ట్-ఎ క్రికెట్ చరిత్రలోనే అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ సాధించినప్పటికీ.. వైభవ్‌కు ఇంకా అంతర్జాతీయ అరంగేట్రం లభించలేదు. ఐర్లాండ్‌తో జరిగిన మొదటి మ్యాచ్‌లో అతనికి చోటు దక్కకపోవడంపై అశ్విన్ గతంలో స్పందిస్తూ.. “బయట కూర్చుని మ్యాచ్‌ను వీక్షించడంలో, జాతీయ జట్టు వాతావరణానికి అలవాటు పడటంలో కూడా ఒక విలువ ఉంటుంది. అతన్ని జట్టుకు సేవ చేయనివ్వండి, సీనియర్లకు సహాయం చేయనివ్వండి, అవసరమైతే నీళ్లు కూడా తీసుకురానివ్వండి. ఆ అనుభవం నుంచి నేర్చుకోవాల్సింది చాలా ఉంటుంది” అని పేర్కొన్నాడు. ఒక గొప్ప ఆటగాడు రాత్రికి రాత్రే అయిపోరని, సచిన్ టెండూల్కర్ లాగే వైభవ్ సైతం ఒక్కసారి ఆడటం ప్రారంభిస్తే మళ్లీ జట్టు నుంచి తప్పుకునే పరిస్థితి రాకపోవచ్చని చెప్పాడు. కానీ.. ఇప్పుడు బెంచ్‌పై కూర్చుంటే జట్టు వాతావరణంపై మంచి అవగాహన వస్తుందని విశ్లేషించాడు. అయితే, ఫామ్‌లో ఉన్న ఓ అసాధారణ ప్రతిభావంతుడిని జట్టుతో పాటు తిప్పుతూ డ్రింక్స్ మోయించడం ఏంటని సోషల్ మీడియాలో అశ్విన్‌పై తీవ్ర విమర్శలు వచ్చాయి. దీనిపై తన యూట్యూబ్ ఛానెల్‌లో స్పందించిన అశ్విన్.. సీనియర్లకు నీళ్లు అందించడం తక్కువ తనం ఎలా అవుతుందని ప్రశ్నించాడు. “వైభవ్ సూర్యవంశీకి మనం సమయం ఇవ్వాలి. అతను అంత ప్రత్యేకమైన ఆటగాడు. అంతర్జాతీయ మ్యాచ్‌లో ఎప్పుడో ఒకప్పుడు ఆడాల్సిందే. కానీ నేను చెప్పేది ఏంటంటే.. వాటర్ మోయడం అనేది దిగజారుడు తనం కాదు. అసలు నీళ్లు అందించడాన్ని జనాలు ఎందుకు తప్పుగా చూస్తున్నారు? 1900లు, 2000ల కాలంలో నేను చెన్నైలో బాల్‌బాయ్‌గా ఉన్నాను, అప్పట్లో క్రికెటర్లకు నీళ్లు అందించడానికి నేను ఎంతో సంతోషపడేవాణ్ణి. గ్రౌండ్‌లోకి పరుగెత్తుకుంటూ వెళ్లి భారత ఆటగాళ్లకు వాటర్ బాటిల్ ఇవ్వడం ఎప్పటి నుంచి తక్కువ పనిగా మారిపోయింది?” అంటూ అశ్విన్ ఘాటుగా బదులిచ్చాడు.

# శ్రేయస్ అయ్యర్ కీలక ప్రకటన



ఐర్లాండ్ చేతిలో ఓడిన భారత జట్టు, బలమైన ఇంగ్లాండ్ తో తలపడేందుకు సిద్ధమైంది. బుధవారం నుంచి ఇండియా, ఇంగ్లాండ్ మధ్య టీ20 సిరీస్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో భారత జట్టు కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంగ్లాండ్ తో జరిగే టీ20లో వైభవ్ ఆడడంపై క్లారిటీ ఇచ్చారు. టీ20 వరల్డ్ కప్ లో రాణించిన వారికి మద్దతుగా నిలవాలని భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ మరోసారి స్పష్టం చేశా-రు. ప్రతి ఆటగాడికి భద్రత కల్పించి.. అవకాశాలు ఇవ్వాలని వెల్లడించారు. అప్పుడే కాన్ఫిడెన్స్ తో తదుపరి మ్యాచ్ లలో ఆడతారన్నారు. టీ20 వరల్డ్ కప్ అందించిన వారికి ఈ ఫార్మాట్ గురించి బాగా తెలుసు అన్నారు. అందుకే వారికి అండగా నిలబడాలని స్పష్టం చేశారు శ్రే-యస్ అయ్యర్. ఇక కెప్టెన్ శ్రేయస్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో, ఇంగ్లాండ్ తో జరిగే టీ20 సిరీస్ లో కూడా వైభవ్ కు అవకాశాలు రావడం కష్టమే అని అంటున్నారు.

# జర్మనీ గోల్‌కీపర్ నోయర్ సంచలన నిర్ణయం..



జర్మనీ స్టార్ గోల్‌కీపర్ మనువెల్ నోయర్ అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు రెండోసారి రిటైర్మెంట్ ప్రకటించాడు. ప్రపంచకప్‌లో జర్మనీ జట్టు ఊహించని రీతిలో టోర్నీ నుంచి నిష్క్రమించడంతో 40 ఏళ్ల నోయర్ ఈ నిర్ణయం తీసుకున్నాడు. సోమవారం పరాగ్వేతో జరిగిన ఉత్కంఠభరిత మ్యాచ్‌లో జర్మనీ ఓటమి పాలైన సంగతి తెలిసిందే. ఈ పరాజయం తర్వాత మీడియాతో మాట్లాడిన నోయర్.. అంతర్జాతీయ కెరీర్‌లో ఇదే తన చివరి మ్యాచ్ అని స్పష్టం చేశాడు. ‘ఇలాంటి చేదు జ్ఞాపకంతో కెరీర్‌ను ముగించాల్సి రావడం చాలా బాధగా ఉంది’ అని ఆవేదన వ్యక్తం చేశాడు. నోయర్ 2024 యూరోపియన్ ఛాంపియన్‌షిప్ అనంతరం అంతర్జాతీయ ఫుట్‌బాల్‌కు తొలిసారి రిటైర్మెంట్ ప్రకటించాడు. మళ్లీ జట్టులోకి వచ్చే ప్రసక్తే లేదని అప్పట్లో తేల్చి చెప్పాడు. అయితే, బార్సిలోనా కీపర్ మార్క్-ఆండ్రీ టెర్ స్టెగెన్ గాయపడటంతో.. జర్మనీ కోచ్ జూలియన్ నాగెల్స్‌మన్ విజ్ఞప్తి మేరకు నోయర్ ప్రపంచకప్2026 కోసం మళ్లీ మైదానంలోకి అడుగుపెట్టాడు. నోయర్ పునరాగమనం వరకు ఒలివర్ బౌమాన్ జర్మనీ నంబర్-1 కీపర్‌గా అద్భుత ప్రదర్శన చేసినప్పటికీ నాగెల్స్‌మన్ ప్రపంచకప్‌లో నోయర్‌కే అగ్రతాంబూలం ఇచ్చాడు. కానీ, కోచ్ నమ్మకాన్ని నో-యర్ నిలబెట్టుకోలేకపోయాడు. పరాగ్వేతో జరిగిన నాకౌట్ మ్యాచ్‌లో నిర్ణీత సమయానికి ఇరు జట్లు 1-1తో సమంగా నిలిచాయి. ఆ తర్వాత జరిగిన పెనాల్టీ షూటౌట్‌లో నోయర్ ఒక పెనాల్టీని అడ్డుకున్నప్పటికీ జర్మనీ ఆటగాళ్లు గోల్స్ చేయడంలో విఫలమవడంతో జర్మనీ 3-4 తేడాతో పరాజయం పాలైంది. 2009లో జర్మనీ తరఫున అంతర్జాతీయ అరంగేట్రం చేసిన నోయర్.. మొత్తం 128 మ్యాచ్‌లు ఆడాడు. 2014లో ప్రపంచకప్ సాధించిన జర్మనీ జట్టులో ప్రస్తుతం ఆడుతున్న ఏకైక ఆటగాడు నోయర్ కావడం విశేషం. అతడు రిటైర్మెంట్‌తో జర్మనీ ఫుట్‌బాల్‌లో ఒక సుదీర్ఘమైన, గొప్ప శకం ముగిసిందని క్రీడా నిపుణులు అంటున్నారు.



# 40 ఏళ్ల నాకౌట్ శాపానికి తెర..

ఫిఫా ప్రపంచకప్ 2026 టోర్నీలో ఆతిథ్య మెక్సికో జట్టు కొత్త చరిత్ర సృష్టించింది. తమకు కలిసొచ్చిన ‘అజ్టెకా స్టేడియం’లో ఇవాళ (బుధవారం) జరిగిన రౌండ్-32 నాకౌట్ మ్యాచ్‌లో మెక్సికో 2-0 గోల్స్ తేడాతో ఈక్వెడార్‌ను చిత్తు చేసింది. ఈ విజయంతో ఏకంగా 40 ఏళ్లుగా వెంటాడుతున్న ప్రపంచ కప్ నాకౌట్ శాపానికి మెక్సికో తెరదించింది. చివరిసారిగా 1986లో తమ దేశంలోనే ప్రపంచకప్‌కు ఆతిథ్యమిచ్చినప్పుడు మెక్సికో నాకౌట్ మ్యాచ్ గెలిచింది. ఆ తర్వాత మళ్లీ ఇన్నాళ్లకు నాకౌట్ మ్యాచ్‌లో విజయం సాధించి.. ప్రీక్వార్టర్ ఫైనల్స్‌కు దూ-సుకెళ్లింది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో మ్యాచ్ గంట ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ మ్యాచ్‌లో మెక్సికో ఆది నుంచే ఈక్వెడార్‌పై ఎదురుదాడికి దిగింది. మ్యాచ్ 22వ నిమిషంలో జూలియన్ క్వినోనెస్ ఒక అద్భుతమైన్ గోల్‌తో మెక్సికోకు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఆ తర్వాత 30వ నిమిషంలో క్వినోనెస్ అందించిన అద్భుతమైన పాస్‌ను ఫుల్హామ్ స్ట్రైకర్ రౌల్ జిమెనెజ్ గోల్‌గా మలిచి జట్టు ఆధిక్యాన్ని 2-0కు పెంచాడు. ఈక్వెడార్ ఆటగాడు జాన్ యెబోవా గోల్ చేయడానికి ప్రయత్నించినప్పటికీ మెక్సికో కీపర్ రౌల్ రంగెల్ సమర్థవంతంగా అడ్డుకున్నాడు. ఇరు జట్ల మధ్య జరిగిన పోరులో మ్యాచ్ ముగిసే సమయానికి ఈక్వెడార్ ఆటగాడు పీరో హించాపి రఫ్ బిహేవియర్ కారణంగా రెడ్ కార్డ్ పొంది మైదానాన్ని వీడాడు.

**పీలే సరసన మొరా..**

ఈ మ్యాచ్ ద్వారా మెక్సికోకు చెందిన 17 ఏళ్ల గిల్బెర్టో మొరా సరికొత్త రికార్డు సృష్టించాడు. ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌లో బరిలోకి దిగిన రెండో అతి పిన్న వయ-స్కుడిగా మొరా నిలిచాడు. 1958లో బ్రెజిల్ దిగ్గజం పీలే సృష్టించిన రికార్డు తర్వాత ఆ ఘనత సాధించింది మొరానే కావడం విశేషం. ప్రస్తుత టోర్నీలో గ్రూప్ దశలో ఆడిన మూడు మ్యాచ్‌లతో పాటు ఈ మ్యాచ్‌లోనూ మెక్సికో ఒక్క గోల్ కూడా సమర్పించుకోకుండా అజేయంగా దూసుకుపోతోంది. ఆదివారం జరగబోయే రౌండ్-16 పోరులో ఆయా మ్యాచుల ఫలితాలను బట్టి ఇంగ్లండ్ లేదా కాంగోతో మెక్సికో తలపడనుంది.

# బిజినెస్



## మళ్లీ భారీగా తగ్గిన గోల్డ్ ధరలు..


బంగారం, సిల్వర్ ధరలు కలా? నిజమా? అనే ఆశ్చర్యానికి గురిచేస్తూ తగ్గుముఖం పడుతున్నాయి. వేలకు వేలు తగ్గుతూ కొనుగోలుదారుల్లో జోష్ పెంచుతున్నాయి. నేడు మరోసారి గోల్డ్, సిల్వర్ ధరలు భారీగా పతనమయ్యాయి. నేడు తులం బంగారం ధర రూ. 1260 తగ్గింది. ఢిల్లీలో కిలో సిల్వర్ ధర రూ.5000 పెరిగింది. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల బంగారం (99.9% స్వచ్ఛత) గ్రాముకు రూ.14,078, 22 క్యారెట్ల బంగారం (91.6% స్వచ్ఛత) గ్రాముకు రూ.12,905, 18 క్యారెట్ల బంగారం (75% స్వచ్ఛత) గ్రాముకు రూ.10,559 వద్ద అమ్ముడవుతోంది. హైదరాబాద్ లో 24క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1260 తగ్గి రూ. 1,40,780 కి చేరింది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1150 తగ్గి రూ.1,29,050 కి చేరింది. దేశ రాజధాని ఢిల్లీలో 24క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,40,930 వద్ద అమ్ముడవుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ. 1,29,200 వద్ద ట్రేడ్ అవుతోంది. హైదరాబాద్ లో కిలో సిల్వర్ ధర రూ. 2,45,000కి చేరింది. ఢిల్లీలో కేజీ వెండి ధర రూ. 5000 పెరిగి రూ. 2,40,000 వద్ద సేల్ అవుతోంది.

## ఇండిగో సరికొత్త ఆఫర్



విమాన ప్రయాణికులకు ప్రముఖ ఎయిర్ లైన్ సంస్థ ఇండిగో తీపి కబురు చెప్పింది. ఎకానమీ క్లాస్ ప్రయాణికుల కోసం కొత్తగా ఇండిగో లైట్ పేరుతో ఒక సరికొత్త రాయితీ ఫేర్ ఆప్షన్‌ను ప్రకటించింది. కేవలం క్యాబిన్ లగేజీతో మాత్రమే ప్రయాణించే వారికి తక్కువ ధరకే విమాన ప్రయాణాన్ని అందించడం, వారు ఉపయోగించుకునే సేవలకు మాత్రమే డబ్బులు చెల్లించేలా ఈ ప్లాన్ తీసుకువచ్చారు. సంస్థ ప్రకారం ఇండిగో లైట్ ఛార్జీతో కేవలం క్యాబిన్ బ్యాగేజీని మాత్రమే తీసుకువెళ్లే కస్టమర్లు, తాము ఉపయోగించుకునే సేవలకు మాత్రమే చెల్లించవచ్చని తెలిపింది. ఇండిగో లైట్ ఫేర్ బుకింగ్‌లు 1 జూలై 2026 నుండి ప్రారంభం కాగా 15 జూలై 2026 నుండి ప్రయాణించే వారికి ఈ ఆఫర్ వర్తిస్తుందని సంస్థ పేర్కొంది. దేశీయ మరియు అంతర్జాతీయ నాన్-స్టాప్ రూట్లలో ప్రయాణించే వారందరికీ ఈ స్కీమ్ వర్తిస్తుందని, వన్-వే, రౌండ్ ట్రిప్, మల్టీసిటీ ప్రయాణాలు చేసే పెద్దలు, పిల్లలు ఇద్దరూ ఈ సదుపాయాన్ని ఉపయోగించుకోవచ్చని తెలిపింది. ఈ సదుపాయం ఇండిగో అధికారిక వెబ్‌సైట్, మొబైల్ అప్లికేషన్, కాంటాక్ట్ సెంటర్ వంటి ప్రత్యక్ష మార్గాల ద్వారా చేసే బుకింగ్ చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈ నిర్ణయం తక్కువ లగేజీతో ప్రయాణాన్ని ప్లాన్ చేసుకునే మధ్యతరగతి ప్రయాణికులకు ఎంతో ఊరటనిస్తుందని విమానయాన రంగ నిపుణులు భావిస్తున్నారు.

## లాభాల్లో దేశీయ సూచీలు..



గత రెండ్రోజులు నష్టాలను చవిచూసిన దేశీయ సూచీలు బుధవారం లాభాలతో ప్రారంభమయ్యాయి. కనిష్ఠాల వద్ద మదుపర్లు కొనుగోళ్లకు మొగ్గు చూపడం మార్కెట్లను ముందుకు నడిపిస్తోంది. ముఖ్యంగా బ్యాంకింగ్ రంగ స్టాక్‌లపై మదుపర్లు ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ (94.71) స్థిరంగా కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సెన్సెక్స్, నిఫ్టీ లాభాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (76,478)తో పోల్చుకుంటే బుధవారం ఉదయం దాదాపు 150 పాయింట్ల లాభంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత పైకి వెళ్లింది. ఉదయం 9:40 గంటల సమయంలో సెన్సెక్స్ 282 పాయింట్ల లాభంతో 76,760 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 89 పాయింట్ల లాభంతో 23,954 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీలో డాబర్ ఇండియా, ఎమ్-సీఎక్స్ ఇండియా, శ్రీ సిమెంట్స్, నెస్లే, పేజ్ ఇండస్ట్రీస్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి. కేపీఐటీ టెక్, టాటా ఎలాక్సీ, అవెన్యూ సూపర్ మార్కెట్, ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్, జిందాల్ స్టీల్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. బ్యాంక్ నిఫ్టీ 127 పాయింట్ల లాభంతో ఉంది. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 123 పాయింట్ల లాభంతో ఉంది.

## హైదరాబాద్ స్టార్టప్ ‘స్కైరూట్ ఏరోస్పేస్’



భారత అంతరిక్ష రంగంలో సరికొత్త విప్లవానికి తెరలేచింది. దేశానికి చెందిన ప్రయివేట్ శాటిలైట్స్ అంతరిక్షంలోకి చేరేందుకు కొత్త దారులు పడుతున్నాయి. ఈ క్రమంలో హైదరాబాద్ నగరానికి చెందిన ‘స్కైరూట్ ఏరోస్పేస్’ అంకుర సంస్థ తన తొలి శాటిలైట్ ను శ్రీహరికోట షార్ ఆధ్వర్యంలో పంపేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. అంతేకాదు భారత్ నుంచి అంతరిక్షానికి వెళుతున్న తొలి ప్రయివేట్ ఉపగ్రహం కూడా ఇదే కావడం విశేషం. 2018 లో హైదరాబాద్ వేదికగా మొదలైన స్కైరూట్ ఏరోస్పేస్ అంకుర సంస్థ 2022 లో కూడా విక్రమ్-S అనే అతి చిన్న ఉపగ్రహాన్ని స్పేస్ లోకి పంపింది. తాజాగా శ్రీహరికోటలో ఉన్న భారత అంతరిక్ష పరిశోధన సంస్థకు చెందిన ‘ఫస్ట్ లాంచ్ ప్యాడ్’ వద్ద తమ ప్రతిష్టాత్మక ‘విక్రమ్-1’ రాకెట్ మొదటి దశను విజయవంతంగా అమర్చింది. భారతదేశంలో ప్రైవేట్ రంగానికి చెందిన ఒక ఆర్బిటల్ రాకెట్‌ను ఇస్రో లాంచ్ ప్యాడ్‌పై ప్రయోగం కోసం అమర్చడం ఇదే మొట్టమొదటిసారి కావడం విశేషం. ఇందుకు సంబంధించిన ప్రత్యేక చిత్రాలను స్కైరూట్ సంస్థ తన అధికారిక ‘ఎక్స్’ ఖాతా ద్వారా పంచుకుంది.

**సిద్ధమవుతున్న తొలి ప్రైవేట్ ఆర్బిటల్ రాకెట్**

లాంచ్ ప్యాడ్ వద్ద విక్రమ్-I రాకెట్ రూపుదిద్దుకుంటోందని స్కైరూట్ ఏరోస్పేస్ ప్రతినిధులు వెల్లడించారు. రాకెట్ ప్రయోగాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నామని, అందుకే సాంకేతిక నిపుణుల సమక్షంలో ప్రతి దశను ఎంతో జాగ్రత్తగా అమర్చి, తుది ప్రయోగానికి సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. రాబోయే కొద్ది రోజుల్లోనే విక్రమ్-1 రాకెట్‌తో తమ మొట్టమొదటి కక్ష్య ప్రయోగాన్ని చేపట్టేందుకు అంతా సిద్ధం చేస్తున్నట్లు సంస్థ స్పష్టం చేసింది.

**చిన్న ఉపగ్రహాలే లక్ష్యం**

ప్రస్తుత అంతరిక్ష మార్కెట్‌లో చిన్న ఉపగ్రహాలకు ఉన్న విపరీతమైన డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని స్కైరూట్ ఈ రాకెట్‌ను ప్రత్యేకంగా అభివృద్ధి చేసింది. వాణిజ్యపరంగా తక్కువ బరువు గల చిన్న ఉపగ్రహాలను భూమికి సమీప కక్ష్యలోకి అత్యంత సురక్షితంగా, తక్కువ ఖర్చుతో తీసుకువెళ్లడానికి ఈ విక్రమ్-1 రాకెట్‌ను రూపొందించారు. ఈ ప్రయోగం విజయవంతమైతే, అంతర్జాతీయ ప్రైవేట్ అంతరిక్ష వాణిజ్య మార్కెట్‌లో హైదరాబాద్ సంస్థల ప్రతిష్ట మరింత ఎత్తుకు చేరడం ఖాయమని శాస్త్రవేత్తలు భావిస్తున్నారు.

## బాలీవుడ్ నటుడితో ప్రేమలో పడ్డ నిహారిక..

తాజాగా, నిహారిక సోషల్ మీడియాలో పెట్టిన ఓ పోస్ట్ ద్వారా వార్తల్లో నిలిచారు. బాలీవుడ్ ప్రముఖ నటుడు, డ్యాన్సర్ రాఘవ్ జుయల్ తో ఎంతో క్లోజ్‌గా ఉన్న కొన్ని ఫొటోలను నిహారిక సోషల్ మీడియాలో పంచుకున్నారు. ఒక ఫొటోలో నిహారికను రాఘవ్ వెనుక నుండి గట్టిగా హగ్ చేసుకుని కనిపించగా.. మరో ఫొటోలో ఇద్దరూ కెమెరాకు నవ్వుతూ పోజులిచ్చారు.అయితే, అన్నింటికంటే ముఖ్యంగా ఈ ఫొటోల్లో నిహారిక తన చేతి వేలికి ఉన్న ఒక ఉంగరాన్ని చూపిస్తూ ప్రత్యేకంగా పోజ్ ఇవ్వడం నెటిజన్ల దృష్టిని ఆకర్షించింది. అలాగే రాఘవ్ కూడా తన ఇన్‌స్టా స్టోరీలో రెడ్ హార్ట్ సింబల్‌తో పాటు స్టార్ గుర్తును జత చేసి ఈ ఫొటోలను షేర్ చేయడం విశేషం. దీంతో వీరిద్దరూ ప్రేమలో ఉన్నారని, అంతేకాకుండా సీక్రెట్‌గా ఎంగేజ్‌మెంట్ కూడా చేసేసుకున్నారంటూ సోషల్ మీడియాలో వార్తలు జోరందుకున్నాయి. ఈ ఫొటోలు చూసిన కొందరు అభిమానులు.. వీరిద్దరు డేటింగ్ చేసుకుంటున్నారని.. రాఘవను ఉద్దేశిస్తూ మొత్తానికి వదిన దొరికేసిందని కామెంట్ల వర్షం కురిపిస్తున్నారు. అయితే దీనిని కొందరు ఇది నిజమైన ప్రేమే అని నమ్ముతుండగా.. మరికొందరు మాత్రం ఇదంతా కేవలం కొత్త ప్రాజెక్ట్ ప్రమోషన్స్ లో భాగమే అని అభిప్రాయపడుతున్నారు. ఏది ఏమైనప్పటికీ, ఈ వైరల్ ఫొటోలపై అటు నిహారిక కానీ, ఇటు రాఘవ్ జుయల్ కానీ అధికారికంగా స్పందిస్తేనే అసలు నిజం ఏంటనేది పూర్తిగా తేలనుంది.





## నా చిరకాల కోరిక నెరవేరుతుంది..

యంగ్ హీరోయిన్ ప్రీతి ముకుందన్ చేసింది తక్కువ సినిమాలే అయినప్పటికీ భారీ క్రేజ్ రాబట్టుకున్నారు. ఆమె చేసిన రెండు చిత్రాలు బాక్సాఫీసు వద్ద వరుసగా ఫ్లాప్ అయినప్పటికీ అమ్మడు క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదు. తనదైన లుక్స్, యాక్టింగ్ స్కిల్స్‌తో తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో స్టార్ హీరోల సినిమాల్లో అవకాశాలు అందుకుంటూ దూసుకుపోతున్నారు. ఇటీవల ఆమె నటించిన ‘బ్లాస్ట్’ మూవీ సూపర్ హిట్‌గా నిలవడంతో పాటు, అందులో ప్రీతి చేసిన యాక్షన్ సీన్స్ అందరినీ ఎంతగానో ఆశ్చర్యపరిచాయి. ప్రస్తుతం అదే జోష్‌లో ఉన్న ఈ భామ, కోలీవుడ్ హీరో అథర్వ మురళి నటిస్తున్న ‘ఇదాయం మురళి’ సినిమాలో ఒక కీలక పాత్రలో నటించారు. కాయదు లోహర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రానికి ఆకాష్ బాస్కరన్ దర్శకత్వం వహిస్తున్నారు. మ్యూజిక్ సెన్సేషన్ ఎస్.ఎస్. తమన్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. ఇప్పటికే శరవేగంగా షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూలై 10న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చిత్ర ప్రమోషన్స్‌లో పాల్గొంటున్న ప్రీతి ముకుందన్, సినిమా విశేషాలతో పాటు తన కెరీర్ గురించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.




## శివాజీ బర్త్ డే స్పెషల్..




సినిమాలో ఆయన క్యారెక్టర్‌కు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ సినిమాలో శివాజీ ‘లైలం బాబు’ అనే ఒక పవర్‌ఫుల్, కాకరేపే పాత్రలో కనిపించనున్నట్లు వెల్లడించారు.విడుదలైన బర్త్‌డే పోస్టర్‌లో శివాజీ లుక్ చాలా రగ్గడ్‌గా, వినూత్నంగా ఉంది. బ్లాక్ అండ్ వైట్ డ్రెస్ వేసుకుని, మెడలో పులిగోరు ధరించి, చేతిలో గోలీసోడా బాటిల్ పట్టుకుని తీవ్రమైన ఆగ్రహంతో చూస్తున్న ఆయన పోజ్ మాస్ ఆడియన్స్‌ను విపరీతంగా ఆకట్టుకుంటోంది. ఈ పోస్టర్ చూస్తుంటే సినిమాలో శివాజీ క్యారెక్టర్ ఎంత పవర్‌ఫుల్‌గా ఉండబోతోందో అర్థమవుతోంది. కాగా.. ప్రసన్న కుమార్ కోట దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో నటాషా సింగ్, నక్ష శరణ్, అక్షర గౌడ హీరోయిన్లుగా నటిస్తున్నారు. వజ్ర వారాహి సినిమాస్ బ్యానర్‌పై శివచెర్రీ, రవికిరణ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనుదీప్ దేవ్ ఈ చిత్రానికి స్వరాలు సమకూరుస్తున్నారు. మైథలాజికల్ టచ్‌తో కూడిన పక్కా రూరల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ‘హైలెస్సో’ చిత్ర షూటింగ్ ప్రస్తుతం శరవేగంగా జరుగుతోంది. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి, ఈ సినిమాను ఈ ఏడాది చివరలో గ్రాండ్‌గా విడుదల చేయడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.




## ఓటీటీ రిలీజ్ వాయిదా?

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన భారీ బ్లాక్‌బస్టర్ ‘పెద్ది’ థియేటర్లలో సూపర్ హిట్‌గా నిలిచిన తర్వాత ఇప్పుడు అందరి దృష్టి ఓటీటీ విడుదలపై పడింది. దర్శకుడు బుచ్చిబాబు సాన తెరకెక్కించిన ఈ రూరల్ స్పోర్ట్స్ డ్రామా ప్రపంచవ్యాప్తంగా 400 కోట్లకు పైగా వసూళ్లు సాధించి బాక్సాఫీస్ వద్ద ఘన విజయం అందుకుంది. దీంతో ఈ సినిమాను డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌లో ఎప్పుడు చూడొచ్చా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పుడు ఓటీటీ విడుదలకు సంబంధించిన తాజా ప్రచారం మెగా అభిమానులను నిరాశకు గురిచేస్తోంది. సినీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, ‘పెద్ది’ డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ భారీ మొత్తానికి సొంతం చేసుకుంది.గతంలో ఈ సినిమా 2026 జూలై 16 నుంచే స్ట్రీమింగ్ అవుతుందనే వార్తలు బలంగా వినిపించాయి. జూన్ 4న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి నాలుగు వారాల థియేట్రికల్ విండో పూర్తవుతుండటంతో అదే తేదీన ఓటీటీలోకి వస్తుందని అనేక కథనాలు ప్రచురించాయి. అయితే తాజా సమాచారం ప్రకారం, సినిమా డిజిటల్ విడుదలను మరో రెండు వారాలు వాయిదా వేసినట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అందుతున్న సమాచారం మేరకు 2026 జూలై 16 నుంచి ‘పెద్ది’ని నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ చేయాలని యోచిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. అయితే దీనిపై ఇప్పటివరకు నెట్‌ఫ్లిక్స్ నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. కాబట్టి విడుదల తేదీపై పూర్తి స్పష్టత రావాలంటే అధికారిక ప్రకటన కోసం వేచి చూడాల్సిందే.




## ఖర్చు పెట్టుకోవడంలో తప్పు లేదు

ఐశ్వర్య తన వ్యక్తిగత అలవాట్ల గురించి ఒక ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు.సినిమా కోసం అంతలా కష్టపడినప్పుడు మనకు మనం బహుమతులు ఇచ్చుకోవడం చాలా ముఖ్యమని ఆమె చెప్పుకొచ్చారు. “నేను నటించే ప్రతి సినిమా పూర్తయ్యాక నాకు నేను ఒక గిఫ్ట్ కొనుక్కుంటాను. అంత కష్టపడి పని చేసినప్పుడు మన కోసం మనం ఖర్చు పెట్టుకోవడంలో తప్పు లేదు” అని ఐశ్వర్య స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే తన లైఫ్‌లో కొనుక్కున్న అత్యంత ఖరీదైన గిఫ్ట్ గురించి చెబుతూ.. “నా కెరీర్‌లోనే అత్యంత ఎక్స్‌పెన్సివ్ గిఫ్ట్ ఒక లగ్జరీ వాచ్. దాని ధర అక్షరాలా 15 లక్షల రూపాయలు. ‘సంక్రాంతికి వస్తున్నాం’ సినిమా పెద్ద హిట్ అయ్యాక.. ఆ చిత్రానికి వచ్చిన రెమ్యునరేషన్‌తో ప్రత్యేకంగా ఈ వాచ్ కొనుక్కున్నాను” అని వెల్లడించారు. ఐశ్వర్య చేసిన ఈ కామెంట్స్ ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. ఒక వాచ్ కోసం అంత భారీ మొత్తంలో ఖర్చు పెట్టడంపై నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఆ బ్రాండెడ్ వాచ్‌లో ఏదో ఒక స్పెషాలిటీ ఉండే ఉంటుందని కామెంట్లు పెడుతున్నారు.

## ‘వారణాసి’ వార్ సీన్స్..

దర్శకధీరుడు ఎస్ఎస్ రాజమౌళి, సూపర్ స్టార్ మహేష్ బాబు కాంబినేషన్‌లో రాబోతున్న అత్యంత ప్రతిష్టాత్మక చిత్రం ‘వారణాసి’ గురించిన ఒక సెన్సేషనల్ అప్‌డేట్ బయటకు వచ్చింది. ఈ చిత్రానికి సంబంధించిన తదుపరి షూటింగ్ షెడ్యూల్ జూలై 7 నుండి తిరిగి ప్రారంభం కానుంది. ఈ షెడ్యూల్‌లో సినిమాకే హైలైట్‌గా నిలిచే ఒక భారీ యుద్ధాన్ని చిత్రీకరించేందుకు జక్కన్న టీమ్ అంతా సిద్ధం చేసినట్టుగా టాక్. ఈ యాక్షన్ ఎపిసోడ్ కోసం గత కొన్ని వారాలుగా చిత్రబృందం ఎంతో పకడ్బందీగా ప్లాన్ చేస్తున్నట్టుగా సమాచారం.ఈ సీక్వెన్స్‌లో మహేష్ బాబుతో పాటు ఏకంగా 3,500 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులు పాల్గొనబోతున్నారట. రాజమౌళి గత చిత్రాలైన ‘బాహుబలి’, ‘ఆర్ఆర్ఆర్’ లలోని యాక్షన్ సీన్లను సైతం మించిపోయేలా, ఇండియన్ స్క్రీన్‌పై ఇప్పటివరకు చూడని రీతిలో ఈ వార్ సీక్వెన్స్‌ను డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఈ సీక్వెన్స్‌లో అసలైన హైలైట్ మరొకటి ఉంది. సెట్స్‌పై 3500 మందితో చిత్రీకరించే ఈ సన్నివేశాన్ని విజువల్ ఎఫెక్ట్స్ ద్వారా వెండితెరపై ఓ రేంజ్‌లో చూపించబోతున్నారట. ఈ సినిమాలో రామాయణ ఎపిసోడ్ మామూలుగా ఉండదనే టాక్ ఉండనే ఉంది. ఇప్పుడు షూట్ చేయబోయే సీక్వెన్స్‌ను విఎఫ్ఎక్స్ ద్వారా ఏకంగా 50,000 మంది వానర సైన్యాన్ని ప్రేక్షకులకు చూపించబోతున్నారని సమాచారం. రాజమౌళి మార్క్ గ్రాండియర్, మహేష్ బాబు స్క్రీన్ ప్రెజెన్స్‌కు థియేటర్లు బ్లాస్ట్ అవడం పక్కా అంటున్నారు. మరి 2027 ఏప్రిల్ 7న రానున్న వారణాసి ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో చూడాలి.



Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**